TGTEL/25/A3603

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

PUBLISHED FROM HYDERABAD AND VIJAYAWADA

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక : 212 బుధవారం, జూన్ 17, 2026 పేజీలు :8 వెల.1/-

ఆరోగ్యవంతమైన మెడ్చల్ కోసం నమ్మకమైన వైద్య నిపుణులు

అత్యుత్తమమైన సేవలు,

ప్రతి అడుగులో మరింత శ్రద్ధ.

జైత్ర

మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

మా ప్రత్యేకతలు

- అత్యవసర & క్రిటికల్ కేర్
- ప్రమాద సేవలు
- ప్రస్తూతి & గైనకాలజీ
- ఆర్థోపెడిక్స్
- జాయింట్ రీప్లేస్‌మెంట్స్
- జనరల్ మెడిసిన్
- జనరల్ సర్జరీ
- మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ
- పిల్లల వైద్యం & శిశు సంరక్షణ
- న్యూరాలజీ • న్యూరోసర్జరీ
- ప్లాస్టిక్ సర్జరీ • పల్మనాలజీ
- యూరాలజీ • డెర్మటాలజీ
- సైకియాట్రీ • ఫిజియోథెరపీ




నమ్మకమైన వైద్యం | నైతిక వైద్య సేవలు | చికిత్సే ముందుగా | నిపుణుల క్లినికల్ సంరక్షణ

అన్ని ఇన్సూరెన్స్ క్యాష్‌లెస్ సౌకర్యం | 24/7 అత్యవసర సేవలు | అత్యాధునిక అంబులెన్స్

+91 85230 89599 +91 86889 09384

www.jaitrahospitals.com • ITI పక్కన, NH 44, చంద్ర నగర్, మెడ్చల్, తెలంగాణ - 501401.

## థీమ్ మ్యూజిక్‌ను ఉపయోగించిన ప్రధాని నరేంద్ర మోడి



సినీ ఇండస్ట్రీలో పాన్ ఇండియా ట్రెండ్ మొదలు కాకముందే..ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ దేశమంతటా పెద్ద స్థాయిలో అభిమానులను సంపాదించుకున్నారు. ఆయన సినిమాలు, పాటలు, డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్ .. అన్నీ సరిహద్దులను దాటి ప్రేక్షకులను మెప్పించి వారి మనసుల్లో తిరుగులేని స్థానాన్ని సంపాదించుకున్నాయి.

అందుకు లేటెస్ట్ ఎగ్జాంపుల్ ప్రధాని నరేంద్ర మోడి తన సోషల్ మీడియా పోస్టుల్లో ఒక దానిలో 23 థీమ్ మ్యూజిక్‌ను ఉపయోగించటమే. ఇది అల్లు అర్జున్‌కు ఉన్న ప్రజాదరణ, సాంస్కృతిక ప్రాధాన్యతను తెలియజేస్తోంది.

 oo23 ఇంకా ప్రారంభ దశలో ఉన్నప్పటికీ దాని థీమ్ మ్యూజిక్ ఇప్పటికే మెయిన్‌స్ట్రీమ్ చర్చల్లో చోటు దక్కించుకుంది. రాబోయే ప్రాజెక్ట్ నుంచి వచ్చిన కంటెంట్‌కే దేశవ్యాప్తంగా ఇంతటి ఆదరణ ఉండటమనేది చాలా అరుదైన విషయంగా పేర్కొనవచ్చు. చాలా సంవత్సరాలుగాఅల్లు అర్జున్ సక్సెస్‌ఫుల్ నటుడు మాత్రమే కాదు.. సరిహద్దులను దాటి రాణిస్తున్నారు. ఆయన సినిమాలు, అందులోని కంటెంట్ తరచుగా సాంస్కృతిక క్షణాలుగా మారుతూ భారతదేశం అంతటా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.

oo23 మూవీ చుట్టూ రోజు రోజుకీ అభిమానులు, సినీ ఇండస్ట్రలో ఆసక్తి పెరుగుతోంది. ఇలాంటి సందర్భాలే అల్లు అర్జున్‌ని పాన్ ఇండియాస్టార్‌గా నిరూపిస్తున్నాయి. అలాగే సినిమా పరిమితులను దాటి విస్తరించిన ఆయన ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తోంది.

## బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లు అందుబాటులో ఉంచాలి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 16 : ధాన్యం దిగుబడిపైన వ్యవసాయ శాఖకు సంపూర్ణ అవగాహన ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. రైతు వేదికలో విత్తనాలు అందుబాటులో ఉంచాలని మార్గనిర్దేశం చేశారు. సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలని ఆదేశించారు. హైదరాబాద్ ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో వ్యవసాయ శాఖపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. బోనస్ ఇచ్చే 7 రకాల సన్న వడ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. 7 రకాల సన్న వడ్లను సబ్సిడీపైన ఇవ్వాలని మార్గనిర్దేశం చేశారు. భద్రాద్రి కొత్తగూడం దమ్మపేట మండలంలో ప్రారంభించిన పైలెట్ ప్రాజెక్ట్‌ను మరింతగా వినియోగించుకోవాలని సూచించారు.వ్యవసాయ శాఖలో సాంకేతికతను మరింతగా పెంచుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఏఐని మరింతగా వినియోగించాలని నిర్దేశించారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకొని సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. సీడ్స్ నుంచి కొనుగోలు వరకు వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయిస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించుకునే ప్రయత్నాలు చేయాలని పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్‌ను బలోపేతం చేసుకోవాలని తెలిపారు. అన్ని వ్యవసాయ మందులకు సంబంధించి ఓ యాప్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా బుక్ చేసుకునే యూరియాను రైతు వేదిక ద్వారా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు యూరియా పంపిణీ బాధ్యతను అప్పగించాలని ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువుల కేటాయింపులపై ఎప్పటికప్పుడూ కేంద్రప్రభుత్వానికి లేఖలు రాయాలని ఆదేశించారు.రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయిన ఎరువులు మొత్తం తెలంగాణకే ఇచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎరువుల పరిస్థితిపైన అన్ని పార్టీల ఎంపీలతో ఓ సమావేశం నిర్వహించి పరిస్థితిని వివరించాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## యాప్‌లో యూరియా బుకింగ్.. రైతువేదికల్లో పంపిణీ: సీఎం రేవంత్



హైదరాబాద్: బోనస్ ఇచ్చే 7 రకాల సన్నవడ్ల విత్తనాలను రైతు వేదికల్లో అందుబాటులో ఉంచాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి (=వఙఖత్ష్ట =వ౧౧ఎ) ఆదేశించారు. వాటిపై రైతులకు సబ్సిడీ ఇవ్వాలని సూచించారు. వ్యవసాయశాఖపై సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు.

"సన్నవడ్లు పండించే రైతుల డేటా సేకరించాలి. వ్యవసాయశాఖలో సాంకేతికతను మరింత పెంచుకోవాలి. అగ్రికల్చర్ వర్సిటీని నోడల్ ఏజెన్సీగా పెట్టుకోవాలి. వడ్ల కొనుగోళ్లలో అగ్రికల్చర్ వర్సిటీతో సమన్వయం చేసుకోవాలి. అన్ని ఫెర్టిలైజర్స్‌కు యాప్ అందుబాటులోకి తీసుకురావాలి. యాప్‌లో బుక్ చేసుకునే యూరియాను రైతువేదికల్లో పంపిణీ చేయాలి. జిల్లా అదనపు కలెక్టర్‌కు ఈ బాధ్యతను అప్పగించాలి. యూరియా, ఎరువుల కేటాయింపులపై తరచూ కేంద్రానికి లేఖలు రాయాలి. రామగుండంలో తయారయ్యే మొత్తం ఎరువులు రాష్ట్రానికే ఇవ్వాలని కేంద్రంపై ఒత్తిడి తేవాలి" అని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు తదితరులు హాజరయ్యారు.


## టీజీ బిల్డర్స్ అసోసియేషన్‌తో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటీ



హైదరాబాద్, జూన్ 16: తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్‌తో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్‌ను చర్చలకు ఆహ్వానించామని.. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విరమించాలని కోరినట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఆర్ అండ్ బీలో రూ.4వేల కోట్లు బకాయిలు పెట్టిందని.. కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని విమర్శించారు. యాదగిరిగుట్ట నిర్మించామని గొప్పలు చెబుతున్నారని, గుట్ట బిల్లులు కూడా రూ.350 కోట్లు బకాయిలు పెట్టారన్నారుబిల్లుల కోసం ఈనెల 18న చలో హైదరాబాద్‌కు తెలంగాణ బిల్డర్స్ అసోసియేషన్ పిలుపునిచ్చిందని మంత్రి తెలిపారు. సీఎంతో మాట్లాడి బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చామన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విరమించాలని కోరగా.. ఈరోజు సాయంత్రం వరకు చర్చించుకుని నిర్ణయం చెబుతామని వారు చెప్పారన్నారు. పత్రికల్లో వార్తల కోసం మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు తమపై తప్పుడు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బట్టకాల్చి మీద వేస్తే కాలిపోతామని అనుకుంటున్నారని అన్నారు. 'మేం ఎంతకు కాంట్రాక్టులు ఇచ్చామో? చూస్తే హరీశ్ రావు తాను పొరపాటుగా మాట్లాడినట్లు ఒప్పుకుంటారు' అంటూ మంత్రి కోమిటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## ఆధార్ కార్డు దుర్వినియోగంపై పిటిషన్..

### కేంద్రం, రాష్ట్రాలకు సుప్రీం కోర్టు నోటీసులు




న్యూ ఢిల్లీ, ఆధార్ కార్డుల దుర్వినియోగంపై దాఖలైన ఒక పిటిషన్‌పై సుప్రీం కోర్టు తాజాగా విచారణ చేపట్టింది. ఆధార్‌ను కేవలం ఐడీ ప్రూఫ్‌గా పరిగణించాలంటూ దాఖలైన పిటిషన్‌పై స్పందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. అశ్వినీ కుమార్ అనే న్యాయవాది ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఆధార్ కార్డు కేవలం ఐడీ ప్రూఫ్‌గా మాత్రమే వినియోగమయ్యేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్నికల సంఘానికి మార్గదర్శకాలు జారీ చేయాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. పౌరసత్వం, స్థానికత, నివాస ధ్రువీకరణ పత్రంగా ఆధార్ వినియోగం కాకుండా స్పష్టమైన మార్గదర్శకాలు ఉండాలని అభ్యర్థించారు. కొత్త ఓటర్ రిజిస్ట్రేషన్ దరఖాస్తులో డేట్ ఆఫ్ బర్త్‌కు ధ్రువీకరణగా ఆధార్ వినియోగం ఆధార్ చట్టంలోని సెక్షన్ 9 ప్రకారం చెల్లదని అన్నారు.ఆధార్ కార్డు పౌరసత్వానికి ప్రూఫ్ కాదని స్పష్టమైన మార్గదర్శకాలు ఉప్పటికీ దుర్వినియోగం అవుతోందని అన్నారు. వయసు ధ్రువీకరణ, పౌరసత్వం, స్థానికత, స్కూలు అడ్మిషన్లు, ఆస్తుల కొనుగోళ్లు, బర్త్ సర్టిఫికేట్‌కు దరఖాస్తు వంటి సందర్భాల్లో ఆధార్ దుర్వినియోగం అవుతోందని ఆరోపించారు. దీనికి తోడుకు కొత్త ఓటర్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఫార్మ్-6లో కూడా పుట్టిన రోజు ధ్రువీకరణ, నివాసధ్రువీకరణ పత్రంగా దుర్వినియోగం అవుతోందని అన్నారు. కాబట్టి, ఆధార్‌ను కేవలం ఐడీ ప్రూఫ్‌గా పేర్కొంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేసేలా చర్యలు తీసుకోవాలంటూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

## గ్రామీణ ఆరోగ్యానికి భరోసా ఆర్ఎంపీ, పీఎంపీలే

- ఆర్ఎంపీ, పీఎంపీలు లేని గ్రామీణ సమాజాన్ని ఊహించుకోలేం
- వారిపై దాడులు సరికాదు
- గ్రామీణ వైద్యులు సేవలు నిలిపేస్తే ఆరోగ్య వ్యవస్థ స్థంభించే ప్రమాదం
- ప్రభుత్వం వారికి తోడ్పాటు అందించాలి
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు
- 12 ఏళ్ల పాలన నేపథ్యంలో మానకొండూరులో ఆర్ఎంపీ, పీఎంపీలతో కేంద్ర మంత్రి "చాయ్ పే చర్చ"
- తమపై దాడులను అరికట్టాలని కేంద్ర మంత్రికి ఆర్ఎంపీల వినతి
- సంఘ భవనానికి ఆర్థిక సాయం అందించాలని విజప్తి



గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఆర్ఎంపీ, పీఎంపీలేనని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్ఎంపీ, పీఎంపీలు లేని గ్రామీణ సమాజాన్ని ఊహించుకోలేమని చెప్పారు. అలాంటి వారిపై దాడులు చేయడం సరికాదని, ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని కోరారు. గ్రామీణ వైద్యులు సేవలు నిలిపేస్తే ఆరోగ్య వ్యవస్థ స్థంభించే ప్రమాదం ఉందని హెచ్చరించారు.ప్రధాని నరేంద్రమోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు ఉదయం మానకొండూరులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆర్ఎంపీ, పీఎంపీలతో "చాయ్ పే చర్చ" కార్యక్రమాన్ని నిర్వహించారు. మోదీ 12 ఏళ్ల పాలనలో సాధించిన విజయాలను, ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. సమాజంలో అట్టడుగునున్న చిట్ట చివరి వ్యక్తికి సైతం సంక్షేమ ఫలాలు అందించడమే బీజేపీ సిద్ధాంతమని, తూ.చ తప్పకుండా అమలు చేస్తున్న మహనీయుడు మోదీ అని కొనియాడారు. మోదీ పాలనా విజయాలను వివరించడంతోపాటు ప్రజలకు మరింత మేలు చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై అవసరమైన సలహాలు సూచనలు తీసుకునేందుకు "చాయ్ పే చర్చ" వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్లు ఫీల్డులో తమకు ఎదురవుతున్న సమస్యలను ఏకరవు పెట్టారు. కొంత మంది కావాలని తమపై అకారణంగా దాడులు చేస్తున్నారని వాపోయారు. తమపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. మానకొండూరు నియోజకవర్గంలో ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్ల అసోసియేషన్ సంఘ భవనం లేదని, నూతన భవన నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని విజ&ఝప్తి చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఆర్ఎంపీలపై దాడులను ఖండించారు. "ఆర్ఎంపీ, పీఎంపీలతో సమాజానికి మంచి జరుగుతోందే తప్ప నష్టం జరగడం లేదు. తక్కువ ఖర్చుతో కుటుంబ సభ్యుల్లా మెలుగుతూ వైద్య సేవ అందిస్తున్నది ఆర్ఎంపీలే. ఆర్ఎంపీలు లేని సమాజాన్ని ప్రజలు ఊహించుకోలేరు. అలాంటి వారిపై దాడులు చేయడం సమర్థనీయం కాదు. ఆర్ఎంపీలు 10 రోజులు తమ సేవలను నిలిపివేస్తే గ్రామీణ ఆరోగ్య వ్యవస్థ పూర్తిగా స్థంభించిపోవడం ఖాయం. గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నది ఆర్ఎంపీలే." అని చెప్పారు. మోదీ పనితీరు గురించి మాట్లాడుతూ... "మోదీ విజన్ ఉన్న నేత. 10 ఏళ్ల ముందు ఈ దేశం ఎలా ఉంటుందో ఆలోచించి అందుకు అనుగుణంగా కార్యక్రమాలు చేపడతారు. డిజిటల్ విప్లవం అందులో భాగమే. 10 ఏళ్ల ముందు జన్ ధన్ ఖాతాలను ఓపెన్ చేసి డిజిటల్ లావా దేవీలను ప్రారంభిస్తే అందరూ హేళన చేశారు.

## ప్ర రా బి నేటిమాట..

కలవడానికి, విడిపోవడానికి చూపించే తొందర అర్థం చేసుకోవడానికి, దగ్గర అవడానికి చూపిస్తే

ప్రతీ బంధమూ అందంగా ఉంటుంది..!

ఒక బంధం అంటే ఎలాగా ఉండాలంటే మాట్లాడితే సంతోషం కలగాలి, కోపడితే భయం కలగాలి, కష్టం చెప్తే ధైర్యం అవ్వాలి

తప్పు చేస్తుంటే కరిసిరి సరి చేయాలి బంధం అంటే అదే మరి

- ప్రమీల రాణి బి

# సంపాదకీయం

**బుధవారం, జూన్ 17, 2026**

## మళ్లీ అఖండ కాంగ్రెస్..

ప్రధాని నరేంద్ర మోదీని, ఎన్డీయే ఎదుర్కోడానికి కాంగ్రెస్ భారీ స్కెచ్ వేస్తోంది. "అఖండ కాంగ్రెస్" దిశగానే అడుగులు వేస్తోంది. ప్రాంతీయ పార్టీలను కాంగ్రెస్ లో విలీనం చేయాలన్న ప్రతిపాదనలు పంపుతోంది. దీంతో రాజకీయ సమీకరణాలు మారుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నుంచి బయటకువెళ్లి, పార్టీలు పెట్టిన నేతలను సొంతగూటికి తీసుకువచ్చేందుకు ప్రయత్నాలను మొదలు పెట్టింది. నేతలే కాదు, పార్టీలు సైతం విలీనానికి ప్రాథమిక దశలో సానుకూలంగా వుంటూ, చర్చలు సాగిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ లో కలిపేసి, బలమైన శక్తిగా మారాలని ఆ ప్రాంతీయ పార్టీల నేతలు ఆలోచనలో వున్నారు. ఇప్పటికే వీటికి సంబంధించిన చర్చ కూడా కొనసాగుతున్నాయి.మొదట ఈ విలీన ప్రతిపాదన తృణమూల్ కాంగ్రెస్ తో ప్రారంభమైంది.బెంగాల్ లో ఓటమి పాలైన తర్వాత, మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ లో తిరుగుబాటు బావుటా ఒక్క సారిగా పైకి వచ్చేసింది. ఏకంగా 20 మంది తాము ఎన్డీయేలో చేరేందుకు సిద్ధంగా వున్నామని ఎంపీలు ప్రకటించారు. దీంతో తృణమూల్ కాంగ్రెస్ లో వివాదం రేగింది. అలాగే అభిషేక్ బెనర్జీ చుట్టూ వివాదాలు చుట్టుకున్నాయి. అంతలోనే ఢిల్లీలో ఇండియా కూటమి సమావేశం కూడా జరిగింది. కొన్ని రోజులుగా ఇండియా కూటమి సమావేశాలకు మమతా దూరంగా వుంటూ వస్తున్నారు. ఎప్పుడైతే బెంగాల్ లో ఓడిపోయారో, ఇండియా కూటమి సమావేశానికి హాజరయ్యారు.ఇంతలోనే తృణమూల్ ను కాంగ్రెస్ లో కలిపేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. దీని ద్వారా ఇరు పార్టీలకు కూడా లాభం చేకూరుతుందని, ఇందుకు సోనియా, ప్రియాంక, రాహుల్ డీల్ చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి. అంతలోనే సోనియా, మమత భేటీ కూడా జరిగింది. అంతర్గత సంక్షోభాన్ని ఎదుర్కోడానికి విలీనం చేయాలని భావించారు. గతంలో కాంగ్రెస్ నుంచి విడిపోయి పార్టీ పెట్టుకున్న వారంతా తిరిగి కాంగ్రెస్ లో విలీనం చేయాలన్న ప్రతిపాదనలు జోరందుకున్నాయి. తాజాగా మరో వార్త కూడా హల్ చల్ చేస్తోంది. ఎన్సీపీ శరద్ పవార్ కూటమి కూడా కాంగ్రెస్ లో విలీనం అయ్యే అవకాశాలు వున్నట్లు వార్తలు వస్తున్నాయి. 1999 లో కాంగ్రెస్ తో విభేదించి శరద్ పవార్ ఎన్సీపీని స్థాపించారు. సోనియా గాంధీ విదేశీయతను పవార్ ప్రశ్నించడంతో కాంగ్రెస్ బహిష్కరించింది. అలాగే సంగ్మా, తారీఖ్ అన్వర్ ను కూడా బహిష్కరించారు. వీరు ముగ్గురు కలిసి ఎన్సీపీని స్థాపించారు. టీఎంసీ మాదిరిగానే ఎన్సీపీలోనూ సంక్షోభం వుంది. అజిత్ పవార్ నాయకత్వంలో తిరుగుబాటు బావుటా ఎగరేశారు. దీంతో పార్టీ చీలిపోయింది. అయితే విలీన ప్రతిపాదన తమ వద్దకు రాలేదని సుప్రియా సూలే ప్రకటించారు. తాము కూడా అలా అనుకోవడం లేదని ప్రకటించారు. అలాగే మరి కొందరు కూడా కాంగ్రెస్ లో విలీనం అవ్వాలని కాంగ్రెస్ ప్రతిపాదనలు పంపింది. మరో వైపు న్ని రోజులుగా తృణమూల్ పార్టీ కాంగ్రెస్ లో విలీనం అయిపోతోందన్న వార్తలు భారీగా చక్కర్లు కొడుతున్నాయి. ఈ మేరకు మమతా బెనర్జీ కాంగ్రెస్ అగ్రనేత సోనియాతో కూడా భేటీ అయ్యారు. దీంతో ఈ వార్తకు మరింత ఊతమిచ్చింది. అయితే దీనిపై కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందించారు. విలీనంపై వస్తున్న వార్తలన్నీ పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీ ఇద్దరూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీని కలిసిన మాట వాస్తవమేనని అంగీకరించారు. అది ఓ సాధారణ సమావేశమేనని స్పష్టం చేశారు. అసలు విలీనం గురించి చర్చలే జరగలేదన్నారు.కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ కార్యాచరణను స్వతంత్రంగా కొనసాగిస్తోందని, టీఎంసీ కూడా తన పార్టీ విధానాల ప్రకారమే ముందుకు సాగుతోందని తెలిపారుకాంగ్రెస్ పార్టీలో వైసీపీ విలీనం అని కొందరు లేదు ఇండియా కూటమిలో చేరి కాంగ్రెస్ తో పొత్తులు పెట్టుకుంటారు అని మరి కొందరూ ఇలా రకరకాలైన ప్రచారం చేస్తున్నారు. అయితే ఏపీలో పొలిటికల్ సన్నివేశం పూర్తిగా వేరు అని గుర్తు చేస్తున్నారు. జగన్ ఆలోచనలు ఆయన మనస్తత్వం కాంగ్రెస్ ని జగన్ వీడిన సందర్భం ఇవన్నీ గుర్తు చేసుకుంటున్న వారు మాత్రం వైసీపీ ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ లో విలీనం అయ్యే ప్రసక్తి లేదని అంటున్నారు. ఏపీలో ఈ రోజుకీ ఒంటరిగానే 40 శాతం ఓటు షేర్ ని సాధించి రేపటి ఎన్నికల్లో గెలిచే పార్టీగా ముద్ర ఉన్న వైసీపీకి కాంగ్రెస్ ని కౌగిలించుకోవడం అవసరమా అన్న ప్రశ్న కూడా రాజకీయ విశ్లేషకులు పలువురు వేస్తున్నారు.ఏపీ రాజకీయాలలో చూస్తే కనుక జగన్ ఒంటరిగానే ఉండేందుకు ఇష్టపడుతున్నారు అని అంటున్నారు. జాతీయ స్థాయిలో బీజేపీకి సందర్భానుసారం విధానాల ప్రాతిపదికన అంటూ బిల్లులకు వైసీపీ మద్దతు ఇస్తోంది. ఆ విధంగా బీజేపీ పెద్దల వద్ద వైసీపీ గుడ్ విల్ సంపాదించుకుంది. అందుకే ఏపీలో టీడీపీ కూటమి మీద ధీటుగా పోరు చేస్తోంది అని అంటున్నారు. ఇక 2029 లో బీజేపీ టీడీపీ జనసేన కూటమిగా వచ్చినా కూడా వైసీపీ ఒంటరిగానే పోరుకు సిద్ధపడుతుందని చెబుతున్నారు. జనాలు నచ్చకపోతే కూటములను అయినా ఓడిస్తారు అన్నది దేశంలో చాలా ఎన్నికలు నిరూపించాయని కూడా వైసీపీ నేతలు అంటున్నారు. పైగా వైసీపీకి చెక్కు చెదరని ఓటు బ్యాంక్ 40 పర్సెంట్ ఉందని మరో పది శాతం తెచ్చుకుంటే అధికారం సొంతం అవుతుందని కూడా లెక్క వేస్తున్నారు. ఇక 2029 ఎన్నికలు చూస్తే కచ్చితంగా ఏ కూటములకు పూర్తి స్థాయిలో మెజారిటీ దక్కే సీన్ ఉండదని కూడా అంటున్నారు. బీజేపీని మూడు సార్లు చూసిన జనాలు ఈసారి పూర్తిగా ఏకపక్షంగా నెత్తికెత్తుకోరు అని అంటున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి బలం పెరిగినా కూడా మ్యాజిక్ ఫిగర్ కి దగ్గరగా రాలేరని అంటున్నారు. దాంతో న్యూట్రల్ గా ఉండే పార్టీలకు ఆ ఎన్నికల తరువాత డిమాండ్ పెరుగుతుందని అపుడు వైసీపీ లాంటి పార్టీలే కీలకంగా జాతీయ స్థాయిలో మారుతాయని కూడా ఫ్యాన్ పార్టీ నేతలు లెక్క వేస్తున్నారు. : ఈ క్రమంలో వైసీపీ అన్ని ఆప్షన్లూ ఓపెన్ గా ముందు పెట్టుకుంటుంది అని అంటున్నారు.

**- ఎడిటర్**

# ఎన్డీయేకు మద్దతుగా టీఎంసీ రెబల్స్

న్యూఢిల్లీ, జూన్ 16,జాతీయ రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరనే నగ్న సత్యాన్ని నిరూపిస్తూ పశ్చిమ బెంగాల్ అధికార పక్షం తృణమూల్ కాంగ్రెస్ కు చెందిన సుమారు 20 మంది రెబల్ ఎంపీలు కేంద్రంలోని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతు ప్రకటించడం సరికొత్త సంచలనానికి తెరలేపింది. వారు ఎన్డీయేలో అధికారికంగా విలీనమవుతారా లేక బయట నుండి మద్దతు ఇస్తారా అనేది పక్కన పెడితే.. కేంద్ర ప్రభుత్వానికి 20 మంది ఎంపీల అదనపు బలం లభించడం ఖాయమైంది. ఈ పరిణామం ఢిల్లీ పీఠాన్ని మరింత సుస్థిరం చేయడమే కాకుండా, కూటమిలోని ఇతర ప్రాంతీయ పార్టీలపై, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడి ప్రాధాన్యతపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న దానిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. కేంద్రంలో బీజేపీకి సొంతంగా పూర్తి మెజారిటీ లేని ప్రస్తుత పరిస్థితుల్లో, ప్రభుత్వ మనుగడకు చంద్రబాబు , నితీష్ కుమార్ అత్యంత కీలకంగా మారారు. కింగ్ మేకర్లుగా ఉన్న వీరిద్దరి డిమాండ్లకు లొంగుతూనే మోదీ-షా ద్వయం ఇన్నాళ్లూ బండిని లాగాల్సి వచ్చింది. అయితే, ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్ నుంచి ఊహించని విధంగా 20 మంది ఎంపీల మద్దతు లభించడంతో కేంద్రంలో ఎన్డీయే నెంబర్ గేమ్ పూర్తిగా మారిపోయింది. చంద్రబాబు , నితీష్ కుమార్ లలో ఎవరైనా ఒకరు మద్దతు ఉపసంహరించుకున్నా ప్రభుత్వానికి ఎలాంటి ఢోకా ఉండదనే బలమైన భరోసా ఇప్పుడు బీజేపీ అధిష్టానానికి దక్కింది. ఈ సమీకరణం సహజంగానే కూటమిలో బీజేపీ బేరసారాల శక్తిని పెంచుతుంది. లోక్‌సభలో అదనంగా 20 మంది ఎంపీల బలం తోడవడంతో.. మిత్రపక్షాల వీటో పవ గణనీయంగా తగ్గింది. ఇది మోదీ, అమిత్ షాలకు రాజకీయంగా పెద్ద ఊరట.ఈ అనుమానాలు రాజకీయ వర్గాల్లో తలెత్తుతున్నాయి. చంద్రబాబు ప్రాధాన్యత పూర్తిగా తగ్గిపోతుందని చెప్పలేం కానీ, గతంలో ఉన్నంత లీవరేజ్ మాత్రం ఇకపై ఉండకపోవచ్చు. రాష్ట్రానికి సంబంధించిన ప్రత్యేక నిధులు, పోలవరం బడ్జెట్, అమరావతి గ్రాంట్ల విషయంలో చంద్రబాబు కేంద్రంపై గతంలో చూపించినంత ఒత్తిడిని ఇకపై ప్రదర్శించడం అంత సులువు కాదు. ఎందుకంటే, కేంద్రంపై ఒత్తిడి మితిమీరితే.. ప్రత్యామ్నాయంగా తమకు టీఎంసీ ఎంపీల మద్దతు ఉందనే సంకేతాన్ని మోదీ, షా ఇవ్వడానికి వెనుకాడరు. అయితే, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాల దీర్ఘకాలిక ఆలోచనలు వేరేలా ఉన్నాయి. వారు చంద్రబాబును అంత తేలికగా దూరం చేసుకోరని ఇండస్ట్రీ ఇన్సైడర్స్ అభిప్రాయపడుతున్నారు. చంద్రబాబు నమ్మకమైన, క్రమశిక్షణ కలిగిన మిత్రపక్షంగా ఉన్నారు. దానికి భిన్నంగా, పశ్చిమ బెంగాల్ నుంచి వస్తున్న టీఎంసీ ఎంపీల మద్దతు తాత్కాలిక అవసరాల కోసమో, మమతా బెనర్జీతో విభేదాల వల్లో పుట్టుకొచ్చిందే తప్ప, సిద్ధాంతపరమైనది కాదు. రేపు ఏదైనా తేడా వస్తే వారు మళ్లీ ప్లేట్ మార్చే ప్రమాదం ఉంది. కాబట్టి, నమ్మకమైన చంద్రబాబును పూర్తిగా పక్కన పెట్టి, అస్థిరమైన టీఎంసీ శ్రేణులపై బీజేపీ పూర్తిగా ఆధారపడే సాహసం చేయదు. ఈ జాతీయ పరిణామాలు ఆంధ్రప్రదేశ్ అంతర్గత రాజకీయాలపై కూడా ఖచ్చితంగా ప్రభావం చూపిస్తాయి. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ఈ అంశాన్ని అస్త్రంగా మార్చుకునే ప్రయత్నం చేస్తోంది. ఇకపై ఢిల్లీలో చంద్రబాబును మోదీ ప్రభుత్వం పట్టించుకోదు అంటూ ఇప్పటి నుంచే ప్రచారం ప్రారంభించింది. అయితే, చంద్రబాబుకు ఉన్న ఇమేజ్, రాష్ట్ర ప్రయోజనాల ఘర్షణ వైఖరి పెట్టుకోకుండా, మరింత చాకచక్యంగా దౌత్యనీతిని ఉపయోగించి ఏపీకి రావలసిన హక్కులను సాధించుకుంటారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. టీఎంసీ ఎంపీల మద్దతు వల్ల ఎన్డీయే కూటమిలో బీజేపీ సీటు కాస్త గట్టిపడిందనేది పచ్చి నిజం. చంద్రబాబుపై ఆధారపడే పరిస్థితి గతంతో పోలిస్తే మోదీ-షాలకు కాస్త తగ్గింది. కానీ, పారదర్శకమైన పాలనలో చంద్రబాబు వంటి సీనియర్ లీడర్ భాగస్వామ్యం ఎన్డీయే ప్రభుత్వానికి జాతీయ స్థాయిలో ఒక బ్రాండ్ వాల్యూని ఇస్తుంది. కాబట్టి చంద్రబాబు హోదాను తగ్గించడం కంటే.. మిత్రపక్షాలన్నింటినీ సమతూకం చేస్తూనే, తమ సొంత ఎజెండాను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లడానికే మోదీ-షా ద్వయం ఈ కొత్త నెంబర్లను వాడుకునే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

# ఉద్ధవ్ శివసేనలో మరో చీలిక

ముంబై, జూన్ 16,మహారాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా అలజడి రేగింది. అంతా బాగుంటుందనుకున్న సమయంలో మాజీ సీఎం, శివసేన (యూబీటీ) ఉద్ధవ్ ఠాక్రే కి సొంత పార్టీ ప్రజా ప్రతినిధులే షాక్ ఇచ్చారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, శివసేన నుంచే విడిపోయిన వేరు కుంపటి పెట్టుకున్న ఏకనాథ్ షిండేతో ఉద్ధవ్ వర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు రహస్యంగా భేటీ అయ్యారు. దీంతో ఉద్ధవ్ ఠాక్రేకి ఝలక్ తగిలినట్లైంది.దీంతో ఉద్ధవ్ వెంటనే అలర్ట్ అయ్యారు. తన నివాసంలో తన వర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులందరితో కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. తన పార్టీ చీలుతోందన్న గట్టి అనుమానం రావడంతో వెంటనే కీలక సమావేశం నిర్వహిస్తున్నారు.ఆపరేషన్ టైగర్"లో భాగంగా, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలోకి కొందరు ఎంపీలు మారవచ్చన్న ఊహాగానాల మధ్య ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే.. ఈ భేటీలో రాజకీయం లేదని, అంత ప్రాధాన్యత భేటీ కూడా కాదని డిప్యూటీ సీఎం షిండే కొట్టిపారేశారు.అయితే, మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ లోని అసమ్మతి వర్గం బీజేపీకి మద్దతు ప్రకటించడంతో, కేంద్రంలో రాజకీయ సమీకరణాలు గణనీయంగా మారే అవకాశం ఉంది. తమకు 20 మంది ఎఓఅ ఎంపీల మద్దతు ఉందని ఆ అసమ్మతి వర్గం పేర్కొంటోంది.ఈ భయం కూడా ఉద్ధవ్ కి వున్నట్లు పుకార్లు వస్తున్నాయి.మహారాష్ట్రలో కొత్త రాజకీయ పరిణామాలకు సంబంధించిన ఊహాగానాలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో, ఈ సమావేశాన్ని ఆ సంస్థ యొక్క విశ్వసనీయతను మరియు అంతర్గత ఐక్యతను అంచనా వేసే ప్రయత్నంగా భావిస్తున్నారు; ఎందుకంటే,యూబీటీకి చెందిన తొమ్మిది మంది లోక్‌సభ సభ్యులలో ఏడుగురు షిండేతో సంప్రదింపులు జరుపుతున్నారని మరియు శివసేనలో చేరడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారని వార్తలు వస్తున్నాయి.జూన్ 7న న్యూఢిల్లీలో షిండేతో ఆ ఎంపీలు సమావేశమయ్యారని, అప్పుడు వారికి శివసేనలో చేరే ప్రతిపాదన చేశారని సమాచారం. ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తూ, 'ఆపరేషన్ టైగర్' దాదాపు పూర్తయ్యే దశకు చేరుకుందని కేంద్ర మంత్రి మరియు శివసేన ఎంపీ ప్రతాప్‌రావు జాదవ్ ప్రకటించారు.ప్రస్తుతం లోక్‌సభలో షిండే నేతృత్వంలోని శివసేనకు ఏడుగురు సభ్యులు ఉన్నారు; భారతీయ జనతా పార్టీ, తెలుగుదేశం పార్టీ మరియు జనతాదళ్ (యునైటెడ్) తర్వాత నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్లో ఇది మూడవ అతిపెద్ద భాగస్వామ్య పక్షంగా ఉంది.ఒకవేళ యూబీటీ కి చెందిన ఏడుగురు ఎంపీలు షిండే సేనలో చేరాలని నిర్ణయించుకుంటే, అది పార్టీ చీలికకు దారితీయడంతో పాటు దిగువ సభలో ఔఅం బలాన్ని పెంచుతుంది.

# ప్రతి సొసైటీకి యూరియా నిల్వల కేటాయింపులు

**రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా బుకింగ్ యాప్ ద్వారా పారదర్శకంగా పంపిణీ**
**రైతు వేదికల ద్వారా కూడా యూరియా పంపిణీకి ఏర్పాట్లు**
**ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి**
**కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి**

నిజామాబాద్, జూన్ 16 : జిల్లాలోని అన్ని సహకార సంఘాలలో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు అవసరమైన మేరకు పూర్తి స్థాయిలో ఎరువుల నిల్వలు జిల్లాకు కేటాయించబడ్డాయని అన్నారు. అన్ని సొసైటీలకు ఎరువులను చేరవేస్తూ, ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా రైతులకు పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా పంపిణీ జరిగేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నందున ఎక్కడ కూడా ఎరువుల కొరత ఏర్పడకుండా రైతుల అవసరాలకు అనుగుణంగా అన్ని ప్రాంతాలకు యూరియా బస్తాలను కేటాయిస్తున్నామని వివరించారు.



ఇప్పటికే ఖరీఫ్ సీజన్ కు సంబంధించి జిల్లాలో లక్షా 39 వేల మంది రైతులకు బుకింగ్ యాప్ ద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా 3.78 లక్షల బస్తాల యూరియా ఎరువు పంపిణీ జరిగిందని వెల్లడించారు. ఒక్కో ఎకరానికి రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేస్తున్నామని అన్నారు. 3 ఎకరాల వరకు విస్తీర్ణం కలిగిన రైతులకు రెండు విడతలలో యూరియా కేటాయించబడుతోందని, ఐదు ఎకరాల వరకు 40:30:30 నిష్పత్తిలో మూడు విడతల్లో, ఐదు ఎకరాలు పైబడి విస్తీర్ణం కలిగిన వారికి 40:20:20:20 నిష్పత్తిలో నాలుగు విడతలలో యూరియా విక్రయాలు జరిపేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. ఆన్లైన్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న 24 గంటల లోపు సంబంధిత సొసైటీ లేదా డీలర్ షాప్ నుండి యూరియా కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. యూరియా ఎరువుల విషయమై రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, జిల్లాలో ఇప్పటికే ఇంకనూ 28వేల మెట్రిక్ టన్నుల స్టాక్ ఉందని కలెక్టర్ భరోసా కల్పించారు. కాగా, ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ప్రభుత్వ రాయితీలు పొందేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ కీలకం కానుందని సూచించారు

# తెలంగాణలో విచారణల పాలిటిక్స్

హైదరాబాద్, జూన్ 16 (న్యూస్ పల్స్)తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ నేతలకు మధ్య పలు కేసుల విచారణకు సంబంధించి రాజకీయం జోరుగా సాగుతోంది. బీఆర్ ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ హయాంలో జరిగిన.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సంచలనంగా మారిందని..దీనిని సీబీఐతో దర్యాప్తు చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి లేఖ రాశారు. కానీ, దీనిపై ఇప్పటి వరకు అతీ గతీ లేదని, కేసీఆర్‌ను కాపాడుతున్నారని సీఎం రేవంత్ పలుసందర్భాల్లో ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలు వచ్చాయి. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ మాజీ అధికారులు కొందరు ఈ కేసులో అరెస్ట్ అయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఎస్ఐబీ మాజీ ఉన్నతాధికారులు విదేశాలకు వెళ్లిపోవడంతో, వారిపై రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయడానికి సీబీఐ ఇంటర్‌పోల్‌కు లేఖ రాసింది. ఫోన్‌ట్యాపింగ్ కేసులో అవినీతి కోణాలు కూడా ఉన్నాయని భావించిన రాష్ట్ర ప్రభుత్వం? ఈడీ, సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ.. లేఖలు సంధించింది. కానీ, ఇప్పటి వరకు కేంద్రం నుంచి సరైన సమాధానం రాలేదన్నది సర్కారు చెబుతున్న మాట.ఈ విషయాన్ని కట్ చేస్తే.. తాజాగా బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని మరో డిమాండ్ చేశారు. సింగరేణి కేలరీస్ లో భారీ ఎత్తున కుంభకోణం జరిగిందని వార్తలు వస్తున్నాయని ఆయన తెలిపారు. దాదాపు 16 వందల కోట్ల రూపాయల విలువైన బొగ్గు దారి మళ్లిందని.. ఇదంతా ఎవరి హయాంలో జరిగింది? దీనివెనుక ఎవరు ఉన్నారు? అనే విషయాలను తేల్చాలని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే దర్యాప్తు చేయించాలని కిషన్ రెడ్డి కోరారు.

## కాంగ్రెస్ లో పదవుల పంచాయితీ

హైదరాబాద్, జూన్ 16 (న్యూస్ పల్స్)కాంగ్రెస్ పార్టీలో సీనియర్లలో అసంతృప్తి పెరుగుతుంది. ఇందుకు సీనియర్ నేత షబ్బీర్ ఆలి ఉదాహరణ. ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీని ఇబ్బందులకు గురి చేశాయి. కాంగ్రెస్ పార్టీలో పదవులను డబ్బులు ఇచ్చిన వారికే ఇస్తున్నారని షబ్బీర్ ఆలి తీవ్ర స్థాయిలో విమర్శించారు. కష్టించి పనిచేసిన నేతలకు కాకుండా అప్పటికప్పుడు పార్టీలోకి వచ్చి డబ్బులు ఇచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్నారని షబ్బీర్ ఆలి చేసిన ఆరోపణలు కాంగ్రెస్ పార్టీలో కాక రేపాయి. గత కొంత కాలంగా షబ్బీర్ ఆలి అసంతృప్తితో ఉన్నారు.తనను పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదని ఆయన భావిస్తున్నారు. పైగా కామారెడ్డి నియోజకవర్గంలో తనకు వ్యతిరేకంగా మరొక నేతను ప్రోత్సహించేందుకు సిద్ధమయ్యారని ఆయన భావిస్తున్నారు. గత కొంత కాలం నుంచి షబ్బీర్ ఆలి కి, చంద్రశేఖర్ రెడ్డి మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శలు చేసుకంటున్నారు. ఈ ఇద్దరి మధ్య వివాదం నేపథ్యంలోనే షబ్బీర్ ఆలీ ఈ వ్యాఖ్యలు చేశారని ప్రత్యర్థి వర్గం ఆరోపిస్తుంది. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పై ఆయన చేసిన తీవ్ర వ్యాఖ్యలపై ఏఐసీసీ కూడా అంతే స్థాయిలో స్పందించింది. షబ్బీర్ ఆలీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది.అయితే షబ్బీర్ ఆలీ మాత్రం ఆ వ్యాఖ్యలకు, తనకు ఏ మాత్రం సంబంధం లేదని చెప్పారు. ఆ ఆడియోలో వినిపిస్తున్న వాయిస్ తనది కాదని అన్నారు. తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొందరు కుట్ర పన్నారంటూ షబ్బీర్ ఆలీ వివరణ ఇచ్చారు. మహేష్ కుమార్ గౌడ్ తో తనకు సుదీర్ఘ కాలం నుంచి తెలుసునని, మంచి మిత్రుడని చెప్పారు. ఆయనపై తాను వ్యతిరేక వ్యాఖ్యలు ఎందుకు చేస్తానని షబ్బీర్ ఆలీ అన్నారు. షోకాజ్ నోటీసులకు అవసరమైన సమాధానాన్ని తాను ఇస్తానని కూడా షబ్బీర్ ఆలీ చెప్పారు. మొత్తం మీద కాంగ్రెస్ లో సీనియర్ నేతలు ఒకింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ నాయకత్వం కూడా పార్టీ కోసం సుదీర్ఘకాలం పనిచేసిన వారిని పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఆర్టీసీ పేరును గుర్తు చేస్తున్న బస్సులు

హైదరాబాద్, జూన్ 16 (న్యూస్ పల్స్)హైదరాబాద్‌లోని ప్రధాన మార్గాల్లో బస్సులు తరచూ బ్రేక్‌డౌన్ అవుతుండటంతో ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నానల్‌నగర్, ఖైరతాబాద్ జంక్షన్, మాసబ్‌ట్యాంక్ కట్టమైసమ్మ దేవాలయం వంటి ప్రాంతాల్లో బస్సులు మధ్యలోనే ఆగిపోవడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 'మహాలక్ష్మి' ఉచిత ప్రయాణ పథకం ప్రారంభమైన తర్వాత ప్రయాణికుల సంఖ్య పెరగడంతో బస్సులపై అదనపు ఒత్తిడి పడుతోంది. కొత్త బస్సులు రాకపోవడం, నిర్వహణ లోపించడం వల్ల ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది.విడిభాగాల కొరత, ఆయిల్ సకాలంలో మార్చకపోవడం వంటి కారణాల వల్ల బస్సులు మధ్యలోనే ఆగిపోతున్నాయి. వైరింగ్, పార్ట్స్ సమస్యల వల్ల కొన్ని బస్సుల నుంచి పొగలు వస్తున్నాయి. డిపోలలో ఫిట్‌నెస్ పరీక్షలు నామమాత్రంగానే జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.మహానగరానికి 7 వేల బస్సులు అవసరం ఉండగా, ఆర్టీసీ ప్రస్తుతం 3200 బస్సులతోనే నెట్టుకొస్తోంది. వీటిలో 500 ఎలక్ట్రిక్ బస్సులు కాగా, మిగిలినవి డీజిల్ బస్సులు. హైదరాబాద్ రీజియన్‌లో 15 సంవత్సరాలు దాటిన బస్సులు సుమారు 250, పదేళ్లు దాటినవి 350 ఉన్నాయి. సికింద్రాబాద్ రీజియన్‌లో 15 సంవత్సరాలు దాటినవి 300, 10 సంవత్సరాలు దాటినవి 300 ఉన్నాయి.

# పాపం మహేష్ గౌడ్...



హైదరాబాద్, జూన్ 16 (న్యూస్ పల్స్) తెలంగాణ కాంగ్రెస్‌లో కొంతకాలంగా అంతర్గతంగా సాగుతున్న లీకుల రాజకీయం ఇప్పుడు పరాకాష్టకు చేరింది. ఏఐసీసీ వేదికగా జరిగిన ఒక అనూహ్య పరిణామం.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కుర్చీకే ఎసరు పెట్టే స్థాయికి చేరడం పొలిటికల్ సర్కిల్స్‌లో పెను సంచలనంగా మారింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్వయంగా ఎంపిక చేసి బరిలోకి దించిన మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురికావడం వెనుక.. తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన కీలక నేతలే వెన్నుపోటుకు పాల్పడ్డారనే పక్కా ఆధారాలు ఢిల్లీ పెద్దలకు చిక్కాయి. ఈ తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యంపై రాహుల్ గాంధీ అత్యంత ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం.మీనాక్షి నటరాజన్ అంటే రాహుల్ గాంధీ కోటరీలో అత్యంత నమ్మకమైన, విలువలతో కూడిన రాజకీయాలు చేసే సీనియర్ నాయకురాలిగా పేరుంది. మధ్యప్రదేశ్‌లో ఆమె నామినేషన్‌ను తిరస్కరించడానికి బేస్‌గా మారిన తెలంగాణ పాత ప్రైవేట్ కంప్లైంట్ వివరాలను.. ఇక్కడి కాంగ్రెస్ నేతలే స్వయంగా బీజేపీకి లీక్ చేశారనే అంశంపై ఏఐసీసీ ఇప్పటికే ఒక ప్రత్యేక విచారణ కమిటీని రంగంలోకి దించింది. పూర్తిగా కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలు, గ్రూపు రాజకీయాల వల్లనే పార్టీ జాతీయ స్థాయిలో ఇంతటి అవమానాన్ని ఎదుర్కోవాల్సి వచ్చిందని రాహుల్ గాంధీకి ప్రాథమికంగానే ఒక స్పష్టత వచ్చేసింది. తన సొంత ఎంపికపైనే దెబ్బకొట్టిన ఈ అంతర్గత శత్రువులను క్షమించే ప్రసక్తే లేదని ఆయన గట్టిగా భావిస్తున్నట్లు ఢిల్లీ వర్గాలు చెప్తున్నాయి. ఈ లీకేజీ వ్యవహారం కేవలం ఒక రాజ్యసభ సీటును కోల్పోవడం కాదు, రాహుల్ గాంధీ నాయకత్వానికే విసిరిన సవాల్‌గా ఢిల్లీ పెద్దలు చూస్తున్నారు. అందుకే, బాధ్యులపై చర్యలతో పాటు తెలంగాణ కాంగ్రెస్‌ను రూట్ లెవెల్ నుండి ప్రక్షాళన చేయాలని డిసైడ్ అయ్యారు.ఈ మొత్తం వ్యవహారంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న మహేష్ కుమార్ గౌడ్ పాత్రపై తీవ్రమైన స్క్రూటినీ నడుస్తోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. పీసీసీ అధ్యక్షుడిగా ఉండి కూడా రాష్ట్రంలో పార్టీ అంతర్గత సమాచారాన్ని, రహస్యాలను కాపాడటంలో, సొంత నేతలను కంట్రోల్ చేయడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారనే బలమైన అభిప్రాయానికి హైకమాండ్ వచ్చింది. ఫలితంగా, తెలంగాణలో పార్టీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు మహేష్ కుమార్ గౌడ్‌ను పక్కన పెట్టి.. గ్రూపులను అణచగల ఒక అత్యంత సీనియర్, పవర్‌ఫుల్ లీడర్‌ను టీపీసీసీ అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే ఏఐసీసీ బ్యాక్‌ఎండ్ వర్క్ కూడా ప్రారంభించినట్లు సమాచారం.ఈ ప్రక్షాళన ప్రభావం కేవలం పార్టీ కమిటీలకే పరిమితం కాకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ పై కూడా తీవ్రంగా పడబోతోంది. ముఖ్యంగా, ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, ఒక డిప్యూటీ సీఎంల మధ్య సాగుతున్న భీకరమైన వర్గపోరు.. ఈ లీకేజీ వ్యవహారానికి ప్రధాన కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ జిల్లాల్లోని కొందరు మంత్రుల వెనుక ఉన్న ఒక బడా బిజినెస్ లాబీ.. కాంగ్రెస్‌లో ఉంటూనే సమాచారాన్ని బీజేపీకి చేరవేసే డబుల్ గేమ్ ఆడుతోందని, ఈ నటరాజన్ ఇష్యూలో కూడా ఆ వ్యాపారవేత్తల హస్తం స్పష్టంగా ఉందని నిఘా నివేదికలు చెప్తున్నాయి. దీంతో ఖమ్మం జిల్లాకు చెందిన హెవీవెయిట్ మంత్రుల పోర్ట్‌ఫోలియోలను మార్చడం లేదా వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం ఖాయంగా మారింది.మరోవైపు, ఈ సంక్షోభాన్ని ఒక సామాజిక సమీకరణాల మార్పుకు కూడా వేదికగా వాడుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం ప్లాన్ చేస్తోంది. చాలా కాలంగా రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల నుంచి వస్తున్న మంత్రివర్గ ప్రాతినిధ్య డిమాండ్‌ను నెరవేర్చడానికి.. ఈ లీకుల వ్యవహారంలో దొరికిపోయిన నాన్-పెర్ఫార్మర్ల మంత్రులను కేబినెట్ నుండి తప్పించనున్నారు. ఆ ఖాళీ అయ్యే స్థానాల్లో బీసీ నేతలకు, సీనియర్లకు చాన్స్ ఇవ్వబోతున్నారని తెలుస్తోంది. ఈ సర్జికల్ స్ట్రైక్ సమయంలో ప్రభుత్వం ఇబ్బంది పడకుండా ఉండేందుకు పార్టీని శాసించగల కొందరు అత్యంత పవర్‌ఫుల్ మంత్రులను ప్రస్తుతానికి టచ్ చేయకుండా.. కేవలం 'వాచ్ లిస్ట్'లో ఉంచి, తగిన సమయంలో వారి సంగతి తేల్చాలని ఏఐసీసీ భావిస్తోంది. మొత్తానికి, మధ్యప్రదేశ్‌లో తిరస్కరణకు గురైన మీనాక్షి నటరాజన్ నామినేషన్ ఎపిసోడ్, ఊహించని విధంగా తెలంగాణ కాంగ్రెస్‌లో ఒక పెను రాజకీయ భూకంపానికి దారితీసింది.

# సింగూరు డ్యామ్ కు డేంజర్ బెల్స్...

మెదక్, జూన్ 16, (న్యూస్ పల్స్) ఉమ్మడి మెదక్ జిల్లా వ్యవసా య రంగానికి వెన్నెముకగా, హైదరాబాద్ జంట నగరాల దాహార్తిని తీర్చే ప్రధాన వనరుగా ఉన్న సింగూరు మల్టీపర్పస్ ప్రాజెక్టు (మంజీరా నది) ప్రస్తుతం అత్యంత కీలకమై న దశను ఎదుర్కొంటోంది. ప్రాజెక్టు భద్రతపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ప్రస్తుతం రిజర్వాయర్‌లో యుద్ధప్రాతిపదికన మరమ్మ తులు సాగుతున్నాయి.అయితే సింగూరు ప్రాజెక్టు మరమ్మతు పను ల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, పనుల మందగమనంపై క్షేత్రస్థాయిలో తీవ్ర అసం తృప్తి వ్యక్తమవుతోంది. ఇటీవల ఎన్‌డీఎస్‌ఏ ఉన్నతాధికారుల తనిఖీల్లో కూడా స్పష్టమైంది. మార్చిలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి చెందిన ఉన్నత స్థాయి నిపుణుల బృందం సింగూరు ప్రాజెక్టును నేరుగా సందర్శించి, సాగుతున్న పనులను పరిశీలించింది. ఆ సమయంలో కాంట్రాక్టర్ వ్యవహరించిన తీరుపై వారు తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రాజెక్టు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంటే, కాంట్రాక్టర్ క్షేత్రస్థాయిలో కేవలం ఒక్క జేసీబీ, ఒక ట్రక్కును మాత్రమే ఉపయోగించి పనులు చేయడంపై అధికారులు తీవ్రస్థాయిలో మండిపడినట్లు తెలిసింది. రిజర్వాయర్ ఎర్త్ డ్యాం లోపలి భాగంలో ఎక్కడైతే రివిట్‌మెంట్ తీవ్రంగా దెబ్బతిని బుంగలు పడ్డాయో, అక్కడ మొదట పనులు ప్రారంభించాల్సింది పోయి.. డ్యాంకు ఒక చివర నుంచి సాధారణ పద్ధతిలో పనులు చేపట్టడంపై నిపుణులు తప్పుపట్టారు. అయితే కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతోనే పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వానాకాలం సీజన్‌లో ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో కాకుండా కేవలం 15 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేయాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. సింగూరు ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా, రివిట్‌మెంట్‌లో ఏర్పడిన బుంగలు, లీకేజీల కారణంగా రక్షణ చర్యల్లో భాగంగా నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం మరమ్మతు పనుల కోసం నీటి నిల్వను గతంలో 8 టీఎంసీలకు తగ్గించగా, వేసవి అవసరాల తర్వాత ప్రస్తుతం అది మరింత పరిమితమయ్యే అవకాశం ఉంది.ఈ వానాకాలంలో కర్ణాటక, మహారాష్ట్ర క్యాచ్‌మెంట్ ఏరియాల నుంచి భారీగా వరద నీరు వచ్చినా.. రక్షణ దృష్ట్యా 15 టీఎంసీలకు మించి నిల్వ చేయకుండా మిగిలిన నీటిని గేట్లు ఎత్తి దిగువకు వదలాలని నిర్ణయించారు. డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ (డీఎస్‌ఆర్పీ) హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఈ పనులను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రాజెక్టు ఆధునికీకరణ, గేట్లు, హోయిస్ట్ పరికరాలు, స్టాప్ లాగ్ ఎలిమెంట్స్, గ్యాంట్రీ క్రేన్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం సుమారు రూ. 22 కోట్ల నిధులు మంజూరు చేయగా, పనులు చేపట్టారు. అలల తాకిడికి దెబ్బతిన్న రిజర్వాయర్ లోపలి భాగంలోని పాత రివిట్‌మెంట్లు తొలగించి, రాళ్లతో కొత్తగా పటిష్టమైన నిర్మాణాలు చేపడుతున్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, గచ్చిబౌలి, మాదాపూర్, మణికొండ వంటి పశ్చిమ ప్రాంతాలకు సింగూరే ప్రధాన తాగునీటి వనరు. వేసవిలో నీటి నిల్వలు తగ్గినప్పటికీ, హైదరాబాద్ జలమండలి ఎమర్జెన్సీ పంపింగ్ ద్వారా నీటి సరఫరాను క్రమబద్ధీకరించింది. ఈ సీజన్‌లో నిల్వ చేయబోయే 15 టీఎంసీల నీరు జంట నగరాల తాగునీటి అవసరాలకు (ఏడాదికి దాదాపు 4 టీఎంసీలు అవసరం), పరిశ్రమలకు పూర్తిగా సరిపోతుంది. దీంతో హైదరాబాద్ తాగునీటి సరఫరాకు ఎలాంటి ముప్పు లేదని అధికారవర్గాలు చెపుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యపు పనులపై వివరణ కోరేందుకు ఇరిగేషన్ శాఖ డీఈని సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.వానాకాలం సీజన్ ముంచుకొస్తున్న వేళ.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు మరింత ఆలస్యమైతే సాగు, తాగునీటి సరఫరాపై ప్రభావం పడనుంది.

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అధికారికంగా దాదాపు 40 వేల ఎకరాల ఆయకట్టుకు ఈ ప్రాజెక్టు నీరందిస్తున్నప్పటికీ సుమారు 80వేల ఎకరాల వరకు సాగు చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యాన్ని 15 టీఎంసీలకే పరిమితం చేస్తున్నందున, వానాకాలం సాగునీటి విడుదలపై ప్రభావం ఉండే అవకాశం ఉంది. క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వచ్చే వరద నీటిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ పంటలకు నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ శాఖ భావిస్తోంది. అయితే పూర్తి నిల్వ లేకపోవడం వల్ల రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మరమ్మతు పనులు నత్తనడకన కొనసాగడంతో వానాకాలం సీజన్‌లో క్రాప్ హాలిడే ప్రకటించే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా కామారెడ్డి, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలకు మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉంది. పనులు పూర్తి కాకపోతే ఈ వానాకాలం వరదలు వచ్చినా రక్షణ దృష్ట్యా కేవలం 15 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ ఉంచగగుతారు.మిగిలిన నీటిని వృథాగా దిగువకు వదలాల్సి వస్తుంది. ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరికలు, ప్రభుత్వం నుండి వచ్చిన ఒత్తిడితో ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రస్తుతం కాంట్రాక్టర్‌పై నిఘా పెంచారు. యంత్రాల సంఖ్యను, కూలీల సంఖ్యను పెంచి వర్షాకాలం ఉధృతి పెరగక ముందే ప్రధాన పనులను ఒక కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలిసింది. సింగూరు ప్రాజెక్టుపై కొన్ని చోట్ల జరుగుతున్న పనుల నాణ్యత ఎన్‌డీఎస్‌ఏ ప్రమాణాలమేరకు చేపట్టడంలేదని అధికారులు హెచ్చరించారు. ఈ నిర్లక్ష్యంపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు రక్షణ విషయంలో రాజీ పడబోమని, కాంట్రాక్టర్లు ఒకే సీజన్ లోపల పనులన్నీ పూర్తిచేయాలని కఠినంగా ఆదేశించారు.పనులను వేగవంతం చేయకపోతే క్రాప్ హాలిడే (పంటల విరామం) ప్రకటించాల్సి వస్తుందని, అది రైతులకు నష్టం కలిగిస్తుందని కాంట్రాక్టర్‌ను, స్థానిక ఇరిగేషన్ అధికారులను హెచ్చరించారు. నీటి అడుగున ఎక్కడైనా పగుళ్లు లేదా లీకేజీలు ఉన్నాయా అని తెలుసుకోవడానికి సోనార్ పరీక్షలు, అండర్ వాటర్ సర్వేలు త్వరితగతిన నిర్వహించాలని మంత్రి సూచించారు.

# ఆడపిల్ల పుట్టిందని భార్యను వదిలేసి..

### మరో మహిళతో భర్త సహజీవనం


### న్యాయం చేయాలంటూ బాధితురాలి ఆవేదన

హైదరాబాద్ ,సరూర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆడపిల్ల పుట్టిందనే కారణంతో భార్యను, కూతురును వదిలేసిన.. తరువాత భర్త మరో మహిళతో సహజీవనం చేస్తూ ఇద్దరు మగ పిల్లలకు తండ్రిగా మారాడు. వనపర్తి జిల్లాకు చెందిన అర్చనకు 2012లో అదే జిల్లాకు చెందిన రవితో వివాహం కాగా.. అత్తింటి వేధింపులు ఎదుర్కొన్నానని అర్చన ఆరోపించింది. ఆడపిల్ల పుట్టిన తర్వాత భర్త, అత్తింటి వారి వైఖరిలో మార్పు వచ్చిందని, తనను నిర్లక్ష్యం చేయడం ప్రారంభించారని వాపోయింది. తనకు దూరంగా ఉంటూ హైదరాబాద్కు మకాం మార్చిన రవి, మరో మహిళతో సహజీవనం చేస్తూ ఇద్దరు మగ పిల్లలకు తండ్రిగా మారాడని ఆరోపించింది. తనకు ఆడపిల్ల పుట్టిందనే కారణంతో భర్త రవి వనపర్తి కోర్టులో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేశాడని, అయితే ఆ పిటిషన్ను న్యాయస్థానంలో వాదనలు కొనసాగుతున్నాయని, సెటిల్మెంట్ కోసం ఈనెల 28న ఫైనల్ హియరింగ్ ఉండగా న్యాయస్థానంకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నట్లు పేర్కొంది.ఇటీవల కుటుంబ సభ్యులు, స్థానికుల సహాయంతో భర్త నివాసం వద్దకు వెళ్లిన, అతడు మరో మహిళతో కలిసి జీవిస్తున్న విషయాన్ని గుర్తించింది. దీంతో తనకు, తన కుమార్తెకు న్యాయం చేయాలని, భరణం ఇప్పించాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం భర్త ఇంటి ముందు ఆందోళనకు దిగింది. తనకు, తన కూతురుకి న్యాయం చేయాలని అధికారులను ఆశ్రయించింది.

# టెలిగ్రామ్‌పై నిషేధం నిరర్థకం..

### సైబర్ సెక్యూరిటీ రీసెర్చర్ నిసర్గ అధికారి

న్యూ ఢిల్లీ, నీట్ పరీక్ష ముగిసేవరకూ టెలిగ్రామ్‌ను ఎవరూ వినియోగించకుండా కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక నిషేధం విధించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సూచనల మేరకు పేపర్ లీక్ రిస్క్‌ను తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ చర్యతో ప్రయోజనం ఉండదని సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు నిసర్గ అధికారి ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. సీబీఎస్ఈ ప్రశ్నపత్రాల మూల్యాంకనానికి ఉద్దేశించిన ఓఎస్ఎమ్ పోర్టల్‌లో భద్రతా లోపాలను గుర్తించిన నిసర్గ సంచలనానికి తెరతీసిన విషయం తెలిసిందే. నిసర్గ ప్రతిభను గుర్తిస్తూ ఐఐటీ కాన్పూర్ అతడికి సీఐ3హబ్‌లో పరిశోధకుడిగా ఛాన్స్ కూడా ఇచ్చింది.టెలిగ్రామ్‌పై కేంద్రం తాత్కాలిక నిషేధం నేపథ్యంలో నిసర్గ ఎక్స్ వేదికగా స్పందించారు. పేపర్ లీక్‌లను అడ్డుకోలేని పరిస్థితి చివరకు టెలిగ్రామ్‌ను బ్యాన్ చేసే స్థితికి దారి తీసిందని వ్యాఖ్యానించారు. టెలిగ్రామ్‌పై నిషేధం అసాధ్యమని తేల్చి చెప్పారు. ప్రాక్సీలు, ఇతర సాధనాల ద్వారా ప్రభుత్వ నిషేధాలను అధిగమించే విధంగా టెలిగ్రామ్ నిర్మాణం జరిగిందని అన్నారు. ఈ నేపథ్యంలో అసలు టెలిగ్రామ్ లాంటి మెసేజింగ్ యాప్‌లపై నిషేధం సాధ్యమేనా? అన్న చర్చ మొదలైంది.టెలిగ్రామ్ అనే యాప్‌ను పావెల్ డ్యూరోవ్ రూపొందించారు. టెలిగ్రామ్ యూజర్లు తమ ఫోన్ నంబర్ సహా వ్యక్తిగత వివరాలేవీ బయటకు పొక్కకుండానే యాప్‌లో ఛానల్స్‌ను నిర్వహించే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా దుర్వినియోగానికి ఆస్కారం ఏర్పడిందని అంటున్నారు. వాట్సాప్‌లో మాత్రం యూజర్లకు మరీ ఇంత స్వేచ్ఛ ఉండదని టెక్ నిపుణులు చెబుతున్నారు. ఏఐ టూల్స్ సాయంతో వాట్సాప్ గ్రూపుల్లో అనుమానాస్పద అంశాలపై మెటా నిత్యం ఒక లుక్ వేసి ఉంటుందని అంటున్నారు.




# అనుమతులు లేకుండా పాఠశాల నిర్వహణ..

### బుక్స్ విక్రయాలపై నారాయణ హై స్కూల్ వద్ద విద్యార్థి సంఘాల నిరసన

బోడుప్పల్ ,మేడ్చల్ జిల్లా బోడుప్పల్లోని నారాయణ హై స్కూల్లో అనుమతులు లేకుండా పాఠశాల నిర్వహిస్తున్నారని, అదేవిధంగా విద్యార్థులకు పుస్తకాలు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్, అంబేద్కర్ స్టూడెంట్ యూనియన్, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. నారాయణ హై స్కూల్కు అవసరమైన అనుమతులు లేకుండానే తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. పాఠశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి పుస్తకాల పేరుతో డబ్బులు వసూలు చేస్తోందని విమర్శించారు. విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ పాఠశాలలపై సరైన పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, యాజమాన్యాలతో కుమ్మక్కై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ఇలాంటి పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా నడుస్తున్న విద్యాసంస్థలను వెంటనే నియంత్రించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు

# ఇసుక రాంపుల వద్ద దోపిడిని అరికట్టాలి

### - ప్రభుత్వానికి లారీ ఓనర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక ర్యాంపుల వద్ద కొనసాగుతున్న అక్రమ వసూళ్లపై సమగ్ర విచారణ జరిపించి దోపిడీని అరికట్టాలని పెద్ద అంబర్పేట్ సాండ్ లారీ ఓనర్స్అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఖైరతాబాద్ లోని ఖనిజాభివృద్ధి సంస్థ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి చెల్లించే డిడి తో పాటు ఇసుక రీచ్ ల వద్ద అక్రమ వసూలులతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ వసూలులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసిన ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. లోడింగ్ పాయింట్ల వద్ద అడుగడుగునా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని వాపోయారు. అక్రమ నిలిపివేయాలని అధికారులకు వినతి పత్రాలు అందించిన వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ జరిపించి అక్రమ దోపిడీని అరికట్టడంతో పాటు దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

# నిర్మల్ జిల్లాలో ఉద్రిక్తత

### గిరిజనులను అరెస్ట్ చేసిన పోలీసులు

నిర్మల్,కడెం మండలం మైసంపేట్ పునరావాస గ్రామస్తులకు వ్యవసాయ భూముల హద్దులు చూపిస్తూ హద్దు రాళ్లను పాతుతున్న రెవిన్యూ అధికారులను గిరిజనులు అడ్డుకున్నారు. తమ గ్రామ గిరిజనులకు భూములు కేటాయించిన తర్వాతే హద్దులు చూపించాలని నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ గిరిజనులు డిమాండ్ చేసారు. అడ్డుకున్న గిరిజనులను అటవీశాఖ అధికారులు, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 20 మంది ఆందోళనకారులను అదుపులోకి తీసుకొని జన్నారం మండలం ఇంధన్ పల్లి అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించారు.150 మంది పోలీసులు, అటవీశాఖ అధికారులు, సిబ్బంది భారీ బందోబస్తు మధ్య మైసంపేట్ పునరావాస గ్రామస్తులకు కేటాయించిన భూములను చదును చేస్తూ రెవెన్యూ హద్దు రాళ్లను పాతుతూ వారి పట్టా నెంబర్లను అధికారులు వేస్తున్నారు.అయితే ఈ భూములలో కొంత నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ గిరిజనులు గతంలో పొరుకులు కొట్టుకొని తాము సాగు చేశామని ఆ భూములను తమకు కేటాయించిన తర్వాతే మైసంపేట్ గ్రామస్తులకు భూములు పంపిణీ చేయాలని నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. మైసంపేట్ పునరావాస గ్రామస్తులకు కేటాయించిన భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు

### ఎమ్మెల్యే తలసాని ఆహ్వానం

సికింద్రాబాద్,సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆషాడ మాస బోనాల ఉత్సవాలను ఆగస్టు 2 వ తేదీన నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం ఆలయ ఇూ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పండితులు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ను వెస్ట్ మారేడ్ పల్లి లోని క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం ఆషాఢమాస బోనాల ఉత్సవాల వివరాలను తెలియజేస్తూ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు లేఖను అందజేశారు. జులై 19 వ తేదీన ఘటాల ఊరేగింపు ప్రారంభం అవుతుందని, ఆగస్టు 2 వ తేదీన అమ్మవారికి బోనాల సమర్పణ, 3 వ తేదీన రంగం (భవిష్య వాణి) ఉంటాయని ఇూ వివరించారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్ పేట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, రాం మోహన్ యాదవ్ తదితరులు ఉన్నారు.

# ప్రేమ పేరుతో పని మనిషిని గర్భవతిని చేసిన వ్యాపారి కొడుకు

### స్థానిక రాజకీయ నాయకులు మాట్లాడుకుంటామని సర్ది చెప్పడంతో కేసు నమోదు చేయని పోలీసులు

రంగారెడ్డి,కొడంగల్ నియోజకవర్గం కోస్గి పట్టణంలో తమ ఇంట్లో పని చేసే 20 ఏళ్ల యువతిని బంగారు వ్యాపారి కుమారుడు సాయికృష్ణ ప్రేమ పేరుతో గర్భవతిని చేసాడు. మూడు నెలల గర్భవతి కావడంతో ఆమెను పెళ్లి చేసుకోవాలని సాయికృష్ణ కుటుంబసభ్యులను యువతి కుటుంబసభ్యులు అడగగా.. సాయికృష్ణ తండ్రి స్థానిక పెద్ద మనుషులతో మంతనాలు జరిపాడు. తనను నమ్మించి గర్భవతిని చేసి మోసం చేశాడని, కులం పేరుతో దూషించి దాడి చేశాడని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్థానిక రాజకీయ నాయకులు మాట్లాడుకుంటామని సర్ది చెప్పడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు. చివరికి యువతి ఒత్తిడితో సాయికృష్ణపై అట్రాసిటీ కేసు నమోదు చేసారు. యువతిని పరీక్షల నిమిత్తం యువతిని నారాయణపేట జిల్లా కేంద్రానికి తరలించారు.

# నీట్ రీ-ఎగ్జామ్‌కు ఇంత భద్రత ఎందుకు.. కేంద్రాన్ని ప్రశ్నించిన అన్నామలై..




న్యూ ఢిల్లీ, నీట్-యూజీ రీ-ఎగ్జామినేషన్ కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భారీ భద్రతా ఏర్పాట్లపై తమిళనాడు బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రశ్నలు లేవనెత్తారు. ఇటీవల జరిగిన పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో రీ-ఎగ్జామ్ నిర్వహించేందుకు అధికారులు కఠిన చర్యలు చేపడుతున్నారు. అయితే ఒక పరీక్ష నిర్వహణ కోసం అంత పటిష్ఠ భద్రత ఎందుకని అన్నామలై ప్రశ్నించారు'ఐఏఎఫ్ విమానాలతో కూడిన సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్ భద్రత.. ఏఐ నిఘాతో కూడిన సీసీటీవీల పర్యవేక్షణ.. ప్రవేశానికి ముందు బయోమెట్రిక్, ఫేస్ ఐడీ.. పలు అంచెల తనిఖీలు.. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ప్రత్యక్ష పర్యవేక్షణ.. అవును, మీరు చదివింది నిజమే.. ఇవి ఉన్నత-స్థాయి, రహస్య, సైనిక-శ్రేణి సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేయడానికి చేసిన ఏర్పాట్లు కావు. ఇవి జూన్ 21, 2026న జరగనున్న నీట్ రీటెస్ట్ కోసం విద్యా మంత్రిత్వ శాఖ చేసిన ఏర్పాట్లు' అని ట్వీట్ చేశారు 'లీకేజీలను అరికట్టడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఒక కీలక పరీక్ష సమయంలో యువ విద్యార్థిపై అదనపు భారాన్ని మోపుతాయనే విషయాన్ని మరచిపోతున్నారు. ఇది మన పరీక్షా వ్యవస్థ మొత్తం ఉద్దేశ్యాన్ని, పరీక్ష ఒత్తిడిని తగ్గించాలనే ఎన్ఈపీ 2020 లక్ష్యాన్ని నీరుగారుస్తోంది. కేంద్రం తీసుకున్న చర్యలు సమస్యను పరిష్కరించకపోగా, మరిన్ని సమస్యలను సృష్టించవచ్చు' అని అన్నామలై పేర్కొన్నారు.

# కుంగిపోయిన కల్వర్టుకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం,ఆళ్ళపల్లి మండల పర్యటనలో భాగంగా ఆళ్ళపల్లి?పెద్ద వెంకటాపురం ప్రధాన రహదారిపై కుంగిపోయిన కల్వర్టును జిల్లా కలెక్టర్ అంకిత్ ూ పరిశీలించారు. పరిస్థితిని గమనించిన వెంటనే వాహనం దిగి కల్వర్టును తనిఖీ చేసి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అత్యవసరంగా మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆర్‌డబీ శాఖ అధికారులను ఆదేశించారు. భవిష్యత్తులో రాకపోకలకు అంతరాయం కలగకుండా సాంకేతిక పరిశీలన నిర్వహించి అవసరమైన పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి వర్షాల సమయంలో ప్రజలకు అసౌకర్యం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అయన సూచించారు. ఈ పరిశీలనలో కొత్తగూడెం ఆర్డీవో మధు, తాసిల్దార్ ఉషారాణి, ఎంఈఓ శాంతారావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అటవీ ప్రాంతమైనా అక్షరాస్యతలో ములుగు ముందంజ

### ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 50 సైకిళ్ల పంపిణీ

ములుగు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో, రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహకారంతో జిల్లా వ్యాప్తంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 50 సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి దనసరి అనసూయ సీతక్క , జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి హాజరై విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ములుగు జిల్లా నిరక్షరాస్యత అధికంగా ఉన్న వెనుకబడిన జిల్లా అయినప్పటికీ జిల్లా అధికారులు, విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల సమిష్టి కృషి ఫలితంగా ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 99.30 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో మొదటి స్థానం, ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రంలో రెండో స్థానం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తోందని, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహకారంతో 50 సైకిళ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

# అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

కరీంనగర్ ,కరీంనగర్ జిల్లా మానకొండూర్ ఎమ్మెల్యే, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక,అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినతి పత్రాలు పరిశీలించడమే కాకుండా బాధితుల సమస్యలను ఓపికగా విన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలు,ఇందిరమ్మ ఇళ్లు,పింఛన్లు, తాగునీరు, రహదారులు, విద్యుత్, భూసంబంధ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు తమ ఫిర్యాదులను సమర్పించారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సూచనలు చేశారు. కొన్ని అత్యవసర సమస్యల విషయంలో అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కాగా మరికొందరు ఆరోగ్య సమస్యలను డాక్టర్ కవ్వంపల్లి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా హాస్పిటల్ రిపోర్టులను పరిశీలించి వారి తగు సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు.

# రాహుల్ ఓ పెద్ద జోక్, రాజకీయ పరిపక్వత లేదు.. డీఎంకే విమర్శల దాడి



చెన్నై: లోక్‌సభలో విపక్ష నేత, తమిళనాడులో తమ మాజీ భాగస్వామి రాహుల్ గాంధీ పై డీఎంకే ఘాటు వ్యాఖ్యలు చేసింది. రాహుల్ గాంధీ ఒక పెద్ద జోక్ అంటూ విమర్శించింది. విపక్షాల ఐక్యతను ఆయన దెబ్బతీశారని ఆరోపించింది. అటు ఇండియా కూటమిలో, ఇటు తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రవర్తనను ప్రశ్నించిందితమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల అనంతరం డీఎంకేతో పొత్తుకు కాంగ్రెస్ పార్టీ ఉద్వాసన చెప్పి విజయ్ సారథ్యంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే)కు మద్దతు తెలపడంపై డీఎంకే ఐటీ విభాగం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో విమర్శలు గుప్పించింది. 'రాజకీయ ఉనికి కోసం కాంగ్రెస్ పోరాడుతున్న సమయంలో మేము వారిని భుజంపై పెట్టుకుని మోసాం. కానీ కొత్త బొమ్మ రాగానే వారు మాకు హ్యాండ్ ఇచ్చి వెళ్లిపోయారు' అని రాసుకొచ్చింది. రాహుల్‌ను ఒక పెద్ద జోక్‌గా అభివర్ణించింది. డీఎంకే అధికారిక పత్రిక 'మురసోలి' సైతం తమ సంపాదకీయంలో రాహుల్‌పై విరుచుకుపడింది. ఇటీవల జరిగిన ఇండియా కూటమి సమావేశంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, విపక్ష పార్టీల్లో చీలికలు తలెత్తడానికి ఆయనే కారకుడని ఆరోపించింది. విపక్షాల ఐక్యత గురించి ఉపన్యాసాలు ఇస్తూ పలు రాష్ట్రాల్లో విపక్షాల ఐక్యతను బలహీనపరుస్తున్నది ఎవరని రాహుల్‌ను నిలదీసింది. కేరళలో వామపక్షాలు సైతం రాహుల్‌పై ఇటీవల చేసిన విమర్శలను ప్రస్తావించింది. ఎన్నికల ప్రచారంలో పినరయి విజయన్‌ను అరెస్టు చేయాలని రాహుల్ డిమాండ్ చేయడం, బీజేపీతో ఎల్‌డీఎఫ్ రహస్య అవగాహన కుదుర్చుకుందని ఆరోపించడంపై కమ్యూనిస్టు నేతలు నిలదీయడాన్ని 'మురసోలి' పత్రిక తమ సంపాదకీయంలో గుర్తుచేసింది. ప్రత్యర్థి బీజేపీకి బదులుగా సొంత భాగస్వామ్య పార్టీలను విమర్శించడానికే రాహుల్ ఆసక్తి చూపారనే అభిప్రాయాలకు ఆయన చర్యలు తావిస్తున్నాయని పేర్కొంది. పలు రాష్ట్రాల్లో అధికారంలోకి రావడం కోసం ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల ప్రయోజనాలకు వ్యతిరేకంగా రాహుల్, కాంగ్రెస్ పదేపదే పనిచేస్తున్నట్టు ఆ సంపాదకీయం ఆరోపించింది. తమిళనాడులో కూటమి బ్యానర్‌పై పోటీ చేసి, సీట్లు గెలిచిన తర్వాత డీఎంకేను కాంగ్రెస్ వంచించిందని విమర్శించింది. కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం ఆమోదంతోనే టీవీకే సారథ్యంలోని ప్రభుత్వానికి మద్దతివ్వాలని కాంగ్రెస్ శాసనసభ్యులు నిర్ణయం తీసుకున్నారని తెలిపింది. రాహుల్ గాంధీ రాజకీయ అపరిపక్వత, నిలకడలేమి కారణంగానే ఇండియా కూటమిలో లుకలుకలు ఏర్పడ్డాయని తప్పుపట్టింది. కాగా, మురసోలి సంపాదకీయంపై కాంగ్రెస్ ఇంకా స్పందించలేదు. అయితే తమిళనాడులో ప్రజాతీర్పునకు అనుగుణంగానే కాంగ్రెస్ వ్యవహరించినట్టు ఆ పార్టీ వర్గాలు అభిప్రాయం వ్యక్తం చేశాయి.

# నచ్చకుంటే నిశ్చింతగా పార్టీని వీడొచ్చు..ఆ తర్వాత బాధపడుతారు : శివసేన అధినే ఉద్ధవ్ ఠాక్రే

హైదరాబాద్ : మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఉద్ధవ్ థాక్రే వర్గానికి చెందిన శివసేన ఎంపీలు షిండే వర్గంలో చేరబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు ఏడుగురు ఎంపీలు షిండేతో సంప్రదింపులు జరుపుతున్నారని, వచ్చే వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లోపు వారంతా షిండే వర్గంలో చేరే అవకాశం ఉందని శివసేనకు చెందిన మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే క్రిపాలు మానె వెల్లడించారు. ఈ నేపథ్యంలో కొంతమంది పార్టీ ఎంపీల విధేయతపై వస్తున్న ఊహాగానాలపై శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్



థాకరే మౌనం వీడారు. పార్టీని వీడాలనుకునే వారిని తాను బలవంతం చేయబోనని స్పష్టం చేశారు. శివసేనను వీడాలనుకునే వారు నిశ్చింతగా వెళ్లిపోవచ్చన్న స్పష్టం చేశారు. పార్టీలో ఉండమని ఎవరిపైనా ఒత్తిడి చేయొద్దని నిర్ణయించు కున్నానని ఆయన పేర్కొన్నారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలో జరిగిన చీలిక గురించి ప్రస్తావిస్తూ.. బాలాసాహెబ్ థాకరే స్థాపించిన పార్టీని వీడిన వారు తమ నిర్ణయం పట్ల చివరికి పశ్చాత్తాపపడతారని థాకరే అన్నారు. శివసేనను వీడాలని నిర్ణయించుకున్న వారు చివరికి చింతిస్తారని పేర్కొన్నారు. ఈ రోజు నాది కాకపోవచ్చు, కానీ రేపు కచ్చితంగా నాదే. అప్పటి వరకు మనం ఇలాంటివి భరించాల్సి ఉంటుందని థాకరే అన్నారు. కాగా, గతంలో థాక్రేతో కలిసి ఉన్న శివసేన నేత షిండే.. ఆ పార్టీలో చీలిక తెచ్చిన సంగతి తెలిసిందే. ఆయన బీజేపీ మద్దతుతో గతంలో మహారాష్ట్ర సీఎంగా కూడా కొనసాగారు. ఇప్పుడు మరోసారి మిగిలిన ఉద్ధవ్ వర్గాన్ని కూల్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

# 'కాంగ్రెస్ ప్రభుత్వంలో స్కీమ్‌లుండవు.. ఓన్లీ స్కామ్‌లే'

### మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
### దేవరకొండలో బీఎల్ఓల శిక్షణా కార్యక్రమం
### హాజరైన బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

దేవరకొండ, జూన్ 16 : కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజల ప్రయోజనార్థం అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఉండవని, కేవలం స్వప్రయోజనం లక్ష్యంగా దోచుకోవడాన్నే పథకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెట్టుకున్నట్లు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న పాలనను చూస్తుంటేనే తెలుస్తోందన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని సాయి శివ ఫంక్షన్ హాల్‌లో ఎస్.ఐ.ఆర్‌పై బీఎల్ఏల శిక్షణ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనన్నారు. సర్ అనే కార్యక్రమంతో ఓట్లను తొలగించే కార్యక్రమం కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వం చేపడుతుందని విమర్శించారు. పశ్చిమబెంగాల్, బీహార్‌లో అలాగే



జరిగిందని, దీంతో అక్కడ భారీ ఎత్తున ఓట్లను అక్రమంగా తొలగించారని ఆరోపించారు. అదే త్వరలో తెలంగాణ రాష్ట్రంలో సర్ అనే కార్యక్రమంలో ఓట్లను అక్రమంగా తొలగించే విధంగా చేస్తున్నారని అలా జరగకుండా ఉండేందుకు గ్రామాల్లో బీఎల్ఏలు ప్రతిరోజు ఓటర్లను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా దోచుకుంటుందని హైడ్రా పేరుతో ఎన్నో ఇండ్లను కుల్చినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ప్రతి ఒక బీఆర్ఎస్ కార్యకర్త సైనికుడి వలె పనిచేసి మళ్లీ బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. లంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ ఒకటేనని, దీన్ని తెలంగాణ ప్రజలు గమనించాలని కోరారు. కేంద్రం నుండి నిధులు తీసుకురాని సీఎం రేవంత్ రెడ్డి దద్దమ్మ అన్నారు. పొద్దున్నే లేస్తే కేసీఆర్‌ను తిట్టడమే తప్ప వేరే పని లేదన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. మనమంతా కేసీఆర్ తయారు చేసిన సైనికులం కాబట్టి వచ్చే ఎన్నికల్లో సైనికుల వలె పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్, చింతల వెంకటేశ్ రెడ్డి, బిల్యా నాయక్, కిషన్ నాయక్, రమేశ్ నాయక్, సర్వయ్య, టీవీఎన్ రెడ్డి, రవి కుమార్, ఆంజనేయులు, శంకర్ నాయక్, శ్రీనివాస్ గౌడ్, వెంకట్ రెడ్డి, వల్లభ్ రెడ్డి, వెంకటేశ్ రావు, రూప్ల నాయక్, మధు, మురళి, అంజి గౌడ్, రవి, శివ, చిరంజీవి, గోపాల్, మోహన్, లోక్య నాయక్, రాజు పాల్గొన్నారు.

# నేషనల్ హైవేపై రెండు ట్రక్కులు ఢీ.. ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనం



ఒడిశాలో దారుణం జరిగింది. రెండు ట్రక్కులు ఢీకొన్న ఘటనలో వాటిలోని ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనమయ్యారు. ఈ ఘటన మంగళవారం ఉదయం ఒడిశాలోని సుందర్‌గఢ్ జిల్లా, భస్మా పోలీస్ స్టేషన్ పరిధిలో కైంత్రా వద్ద, పదో నెంబర్ జాతీయ రహదారిపై జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైవేపై ఝూర్సుగూడ నుంచి సుందర్‌గఢ్ వెళ్తున్న ట్రక్కు అతివేగం కారణంగా అదుపుతప్పింది. వేగాన్ని డ్రైవర్ నియంత్రించలేకపోవడంతో డివైడర్‌ను దాటిన ట్రక్కు ఒకవైపు నుంచి మరోవైపు రోడ్డు మీదికి వెళ్లిపోయింది. దీంతో అటువైపు నుంచి వస్తున్న ట్రక్కును ఢీకొంది. ఇలా రెండు ట్రక్కులు ఢీకొనడంతో వెంటనే మంటలు చెలరేగాయి. అవి పెద్ద ఎత్తున వ్యాపించి, పూర్తిగా అంటుకున్నాయి. ఈ ఘటనలో రెండు ట్రక్కుల్లోని డ్రైవర్లు మంటల్లో సజీవదహనమయ్యారు. వాహనాలు ఢీకొన్న సమయంలో డీజిల్ ట్యాంకర్ పగలడం వల్ల ఒక్కసారిగా మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. రెండు ట్రక్కులకు పూర్తిగా మంటలు అంటుకున్నాయి. డ్రైవర్లు బయటపడే అవకాశమే లేకపోయింది. ఇది గమనించిన ఇతర వాహనదారులు వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను ఆర్పేశారు. కానీ, ఆలోపే ట్రక్కుల్లో ఇద్దరు డ్రైవర్లు కాలిపోయి మరణించారు. మంటల తీవ్రత కారణంగా డ్రైవర్ల మృతదేహాలు తీవ్రంగా కాలిపోయాయి. ఇంకా డ్రైవర్లను గుర్తించాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు.


# యూసుఫ్ పఠాన్ ఇల్లు కూల్చేస్తామని బెదిరించారు.. ఎన్సీపీఐ, టీఎంసీ ఎంపీల ఆరోపణ



పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీకి చెందిన రెబల్ ఎంపీల వ్యవహారం రాజకీయంగా దుమారం రేపుతోంది. గతంలో బీజేపీకి వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నందుకు టీఎంసీ ఎంపీ యూసుఫ్ పఠాన్ బెదిరింపులు ఎదుర్కొన్నారని టీఎంసీ నేత మహువా మొయిత్రా అన్నారు. గతంలో జరిగిన ఒక సంఘటనను శ్రీనగర్ ఎంపీ అగా సయ్యద్ రుహుల్లా మెహ్దీ గుర్తు చేసుకున్నారు. తాజాగా దీనిపై ఎక్స్ వేదికగా స్పందించారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. గత శీతాకాల సమావేశం సందర్భంగా సర్ సహా ఇతర కేంద్ర చర్యలకు వ్యతిరేకంగా పార్లమెంట్లో ప్రతిపక్ష ఎంపీలు నిరసన చేపట్టారు. ఇందులో టీఎంసీకి చెందిన యూసుఫ్ పఠాన్ కూడా ఉన్నారు. అప్పుడు ఒక పార్టీకి చెందిన ముస్లిం ఎంపీ యూసుఫ్ పఠాన్ వద్దకు వచ్చారు. యూసుఫ్ కనుక బీజేపీకి వ్యతిరేకంగా నిరసనల్లో పాల్గొంటే ఆయన ఇల్లు బుల్డోజర్తో కూల్చేస్తారని బెదిరించాడు. దీంతో భయపడిపోయిన యూసుఫ్ పఠాన్ అక్కడ్నుంచి వెళ్లిపోయి తన సీట్లో కూర్చున్నాడు. ఈ సమయంలో యూసుఫ్ పఠాన్ ముఖం భయంతో మాడిపోయింది. ఆయన చాలా భయపడిపోయారు. ఈ విషయాన్ని మెహ్దీ వెల్లడించగా.. దీనిపై టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా కూడా స్పందించారు. ఆ ఎంపీ ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అని వెల్లడించారు. ఈ సమయంలో తాను యూసుఫ్‌కు ధైర్యం చెప్పానన్నారు. ఒకవేళ బీజేపీ అలాంటి చర్యలకు పాల్పడితే పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అయితే, అలాంటి యూసుఫ్ పఠాన్ కోసం తాను అండగా నిలిచానని, ఆయనకు ధైర్యం లేదని మహువా మొయిత్రా విమర్శించారు. ప్రస్తుతం టీఎంసీకి చెందిన 19 మంది ఎంపీలు రెబల్ గ్రూపులో చేరిన సంగతి తెలిసిందే. వారంతా తాము టీఎంసీ నుంచి వీడుతామని, తమను నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్సీపీఐ)లో విలీనం చేయాలని కోరారు. ఇందులో యూసుఫ్ పఠాన్ కూడా ఉన్నారు. దీనిపై లోక్‌సభ స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

# కాఫ్ సిరప్ కొనాలంటే ఇకపై డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి

దగ్గు మందు విక్రయాలకు సంబంధించి నిబంధనలను కేంద్రం తాజాగా కఠినతరం చేసింది. ఇకపై కాఫ్‌సిరప్ విక్రయాలకు డాక్టర్ ప్రిస్క్రిప్షన్‌ను తప్పనిసరి చేస్తూ డ్రగ్స్ రూల్స్-1945 కింద నోటిఫికేషన్ విడుదల చేసింది. గతంలో కాఫ్ సిరప్‌లు షెడ్యూల్ కే డ్రగ్స్ జాబితాలోని క్లాస్ ఆఫ్ డ్రగ్స్ సెక్షన్‌లో 7వ ఎంట్రీగా ఉండేవి. దీంతో, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకపోయినా మెడికల్ షాపులు వినియోగదారులకు కాఫ్‌సిరప్‌లను విక్రయించే అవకాశం ఉండేది. ఈ షెడ్యూల్‌కు కేంద్రం తాజాగా మార్పులు చేసింది. కాఫ్ సిరప్‌లను షెడ్యూల్-ఐలోని మినహాయింపు జాబితా నుంచి తొలగిస్తున్నట్టు తెలిపింది. ఈ కొత్త



ం ూ ల ్ ర ు న ం బ ం ధి ం చి న వ ు ు సా ం ు ు దా నిబంధనలను కేంద్రం గతేడాది డిసెంబర్‌లోనే విడుదల చేసింది. ప్రజల అభిప్రాయాన్ని సేకరించింది. అనంతరం, తుది మార్గదర్శకాలను కేంద్ర ఆరోగ్య కుటుంబసంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ తాజాగా జారీ చేశారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా మెడికల్ షాపులన్నీ ఇకపై మెడికల్ ప్రిస్క్రిప్షన్ ఉన్న వారికే సిరప్‌లను విక్రయించాల్సి ఉంటుంది.

# వేమిరెడ్డికి కీలకం పదవి...

నెల్లూరు, జూన్ 16, నెల్లూరు అంటేనే మొదటి నుంచి కాంగ్రెస్ కి తరువాత కాలంలో వైసీపీకి అచ్చి వచ్చిన జిల్లాగా పేరుంది. రెడ్లు పెద్ద ఎత్తున రాజకీయ ప్రాబల్యం కలిగిన జిల్లాగా నెల్లూరుని చెబుతారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మొత్తం పది ఎమ్మెల్యే సీట్లు ఉంటే 2019లో పదికి పది స్వీప్ చేసి వైసీపీ శభాష్ అనిపించుకుంది. అయితే గిర్రున అయిదేళ్ల కాలం తిరిగేసరికి టీడీపీ కూటమి అదే ఫీట్ ని రివర్స్ లో చేసి వైసీపీకి భారీ షాక్ ఇచ్చేసింది. ఫలితంగా వైసీపీకి ఒక్కరంటే ఒక్కరు ఎమ్మెల్యే లేకుండా పోయారు. బలమైన నేతలు అంతా ఇపుడు టీడీపీలోనే ఉన్నారు. ఈ పరిణామాలతో వైసీపీ మొదటి నుంచి కూడదీసుకునే పనిలో ఉంది. కూటమి తన జోరుని ఎక్కడా తగ్గించడం లేదు, ప్రత్యేకించి టీడీపీ అయితే 2024లో దక్కిన విజయాన్ని ఆ రాజకీయ పట్టుని శాశ్వతం చేసుకోవాలని చూస్తోంది. దాని కోసం భారీ ఎత్తున వ్యూహ రచన కూడా చేస్తోంది.నెల్లూరు జిల్లాలో అంగ బలం అర్ధ బలం దండీగా ఉన్న నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి టీడీపీ భారీ గిఫ్ట్ ఇవ్వబోతోంది అని ప్రచారం సాగుతోంది. ఆయన 2018 నుంచి 2024 దాకా రాజ్యసభ మెంబర్ గా వైసీపీలో పనిచేశారు. వైసీపీని నెల్లూరు జిల్లాలో అన్ని విధాలుగా నిలబెట్టడంలో ఆయన కీలకమైన పాత్ర పోషించారు. ఆయనకు 2024 ఎన్నికల్లో ఎంపీ ఎమ్మెల్యే సీటు ఇవ్వడానికి వైసీపీ సుముఖత వ్యక్తం చేయకపోవడంతో టీడీపీ వైపు వచ్చారని ప్రచారం సాగింది. టీడీపీ ఆయనను సాదరంగా ఆహ్వానించి అక్కున చేర్చుకుని ఆయనకూ ఆయన సతీమణి ప్రశాంతి రెడ్డికి కూడా టికెట్లు ఇచ్చింది. దాంతో మొత్తం నెల్లూరు జిల్లా టీడీపీ కూటమికి చిక్కింది. ఈ నేపథ్యంలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి కేంద్ర మంత్రివర్గంలో పదవి దక్కుతుందని ప్రచారం ఊపందుకుంది. ఆయనకు సామాజిక పరంగానే కాదు రాజకీయంగా ప్రాంతీయ సమీకరణల దృష్ట్యా ఈ పదవిని ఇవ్వడం సముచితం అని పార్టీ పెద్దలు భావిస్తున్నారు అని అంటున్నారు. గ్రేటర్ రాయలసీమలో భాగంగా ఉన్న నెల్లూరు జిల్లాలో వేమిరెడ్డికి కేంద్ర మంత్రి పదవి ఇస్తే కనుక ఆ ప్రభావం కచ్చితంగా రాయలసీమ మీద కూడా పడుతుందని వచ్చే ఎన్నికల్లో వైసీపీ హార్డ్ కోర్ రీజియన్ గా ఉన్న రాయలసీమలో సైతం కూటమి అత్యధిక స్థానాలను గెలుచుకునేందుకు ఇది ఉపకరిస్తుందని కూడా టీడీపీ పెద్దలు వ్యూహరచన చేస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీని వీడిన వారిని వెనక్కి రప్పించే ప్రయత్నంలో వైసీపీ అధినాయకత్వం ఉంది అని ప్రచారం సాగుతోంది. ఇక వేమిరెడ్డి మీద కూడా వైసీపీ ఫోకస్ పెట్టింది అని కూడా చెప్పుకున్నారు. ఆయన విలువ ఏమిటి అన్నది వైసీపీకి 2024 ఎన్నికల ఫలితాల తరువాత తెలిసింది అని అంటున్నారు. అయితే టీడీపీలో వేమిరెడ్డికి గౌరవం దక్కుతోంది, అంతే కాదు ఆయన అనుకున్నది చేసే పరిస్థితి కూడా ఉందని అంటున్నారు. ఇపుడు ఆయనకు కేంద్ర మంత్రి పదవి కూడా దక్కితే కనుక వైసీపీకి రాజకీయంగా మరింత దెబ్బ పడే పరిస్థితి ఉంటుందని అంటున్నారు. అంగబలం అర్ధ బలంతో పాటు కేంద్ర మంత్రిగా బలం కూడా తోడు అయితే నెల్లూరు జిల్లాలో ఫ్యాన్ రెక్కలు జోరందుకోకుండా బ్రేకులు పడతాయని అంటున్నారు. మరి ఈ ప్రచారంలో నిజమెంత అన్నది వేచి చూడాల్సి ఉంది.నెల్లూరు జిల్లాలో రాజకీయాలు హీటెక్కాయి. ఎన్నికలకు మూడేళ్లకు ముందే టీడీపీ, వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం జరుగుతుంది. ప్రధానంగా జిల్లాలోని కోవూరు నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిల మధ్య సవాళ్లు, ప్రతిసవాళు నడుస్తున్నాయి. వేమిరెడ్డిని ఎదుర్కొనేందుకు ప్రసన్నకుమార్ రెడ్డి వద్ద ప్లాన్ ఏంటి? కోవూరు నియోజకవర్గంలో ప్రశాంతి రెడ్డిని ఎదుర్కొనేందుకు నల్లపురెడ్డి వద్ద ఉన్న వ్యూహాలేంటి? అన్న దానిపై చర్చ జరుగుతుంది. ఎందుకంటే బలమైన నేతను ఎదుర్కొనాలంటే అంత ఆషామాషీ కాదు.

జనంలో తీవ్రమైన వ్యతిరేకత వస్తేనే తప్ప విజయం సాధ్యం కాదు. కానీ ప్రశాంతి రెడ్డి ఆ ఛాన్స్ ను నల్లపురెడ్డికి ఎంతమేరకు ఇస్తారన్నది ప్రశ్న.కోవూరు నియోజకవర్గ రాజకీయాల్లో వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డిల మధ్య తీవ్రమైన రాజకీయ మరియు విభేదాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. రాజకీయ ఆధిపత్యం చుట్టూ తిరుగుతుంది. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మరియు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి మధ్య వార్ ఇంకా కొనసాగుతూనే ఉంది. వ్యక్తిగత విమర్శలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ప్రసన్న కుమార్ రెడ్డి గతంలో ప్రశాంతి రెడ్డిపై చేసిన అనుచిత, వ్యక్తిగత వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. వీటిపై ప్రశాంతి రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళా ఎమ్మెల్యే అయిన ప్రశాంతి రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో, మహిళల ఫిర్యాదు మేరకు ప్రసన్న కుమార్ రెడ్డిపై కోవూరు పోలీసులు కేసు నమోదు చేశారు.ఇటీవల వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాన్ని వైసీపీ నిర్వహించింది. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గంలో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి భారీగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేపైనా, కూటమి ప్రభుత్వంపైన తీవ్ర విమర్శలు చేశారు. దీనికి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఘాటుగా సమాధానం ఇచ్చారు. మెరుపుతీగలా కోవూరుకు వచ్చి వెళ్లే నేత గురించి పట్టించుకోవాల్సిన పనిలేదని ప్రశాంతి రెడ్డి నల్లపురెడ్డి పై విరుచుకుపడ్డారు. కోవూరు నియోజకవర్గం ప్రజలు తెలివైన వారని, వచ్చే ఎన్నికల్లోనూ ప్రసన్న గెలవలేంటూ సవాల్ విసిరారు. అంతేకాదు కోవూరు నియోజకవర్గంలో వైసీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కూడా తొలగించడం వివాదం గా మారింది. మొత్తం మీద ఎన్నికలకు మూడేళ్ల ముందే కోవూరు రాజకీయాలతో సలసల మండుతోంది.

## డీఎస్సీలో కులాల లెక్కలు జాతర

విజయవాడ, జూన్ 16, డీఎస్సీ 2025 పై వైయస్సార్ కాంగ్రెస్ అదే పనిగా విషప్రచారం చేస్తోంది. అవి రోజురోజుకు శృతిమించి కులాల వద్దకు కూడా చేర్చింది వైయస్సార్ కాంగ్రెస్. గతంలో కమ్మ డీఎస్సీలు అంటూ 2019 ఎన్నికలకు ముందు హడావిడి చేసిన సంగతి తెలిసిందే. తీరా వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అదే పార్టీకి చెందిన మంత్రి కమ్మ డీఎస్సీలు కాదు.. అన్ని వర్గాల వారికి అవకాశం ఇచ్చారని శాసనసభలో ప్రకటించారు. అయితే ఇప్పుడు డీఎస్సీ 2025 పై దుష్ప్రచారం చేస్తున్న నేపథ్యంలో.. స్పోర్ట్స్ కోటా కింద కమ్మ సామాజిక వర్గం వారికి ఉపాధ్యాయ పోస్టులు ఇచ్చారని చెబుతూ.. కమ్మ డీఎస్సీ అంటూ ప్రచారాలు ప్రారంభించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పేటీఎం చానల్స్ లో కూర్చోబెట్టి.. రిటైర్మెంట్ తీసుకున్న అధికారులతో కమ్మ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చారంటూ విషం చిమ్మడం మొదలుపెట్టారు.డీఎస్సీ 2025 పై ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ అధికారులు ఓపికగా వివరణ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు కమ్మ డీఎస్సీ ఆరోపణలపై కూడా ఏపీ ఫ్యాక్ట్ చెక్ రంగంలోకి దిగి.. అదంతా తప్పుడు ప్రచారం అని తేల్చేసింది. ఈ డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద భర్తీ చేసిన పోస్టులు 381. ఈ 381 పోస్టుల్లో ఓపెన్ క్యాటగిరి కింద ఉన్నవి కేవలం 42 పోస్టులు మాత్రమే. మిగిలిన పోస్టులన్నీ ఎస్సీ, ఎస్ టి, బిసి, మైనారిటీ వర్గాలకు దక్కాయి. ఈ వివాదానికి ప్రధాన కారణం ఆనాలపై రెండు ఓపెన్ క్యాటగిరి పోస్టులు వాటిని పరిశీలిస్తే అందులో కమ్మ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు వచ్చినవి కేవలం 9 పోస్టులు మాత్రమే. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు పది పోస్టులు, కాపు సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు అత్యధికంగా 16 పోస్టులు వచ్చాయి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం తప్పుడు అని అందరికీ తెలుసు. ఎందుకంటే 381 పోస్టుల్లో.. 9 పోస్టులు అంటే కనీసం మూడు శాతం కూడా లేవు. కానీ ఏ లెక్క ప్రకారం స్పోర్ట్స్ కోటా మొత్తం ఒకే కులానికి కట్టబెట్టారు.. ఇందులో భారీ స్కాం జరిగింది అంటూ తప్పుడు ప్రచారాలు మొదలుపెట్టింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పేటీఎం బ్యాచ్. కేవలం మెరిట్, క్రీడా సర్టిఫికెట్ల స్క్రూటినీ ఆధారంగా జరిగిన ఈ నియామక ప్రక్రియను.. ఒక కులానికి ఆపాదించి వివాదం చేయడం చూస్తుంటే కుట్ర కోణం అర్థం అవుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయ ఆరాటం కోసమే నిరుద్యోగ యువతను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది. దాదాపు ఆరు లక్షల మంది అభ్యర్థులు డీఎస్సీ పరీక్ష రాయడంతో వారిలో గందరగోళం రేపి రాజకీయ లబ్ధి పొందాలన్న ఆలోచన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ అది వర్క్ అవుట్ అయ్యే ఛాన్స్ లేదు. అయితే ఆధారాలు లేని ఆరోపణలతో దుష్ప్రచారం చేస్తున్న సదరు యూట్యూబ్ ఛానల్ పై కేసు నమోదు అయ్యే అవకాశం ఉంది. ఆధారాలు లేని కారణంగా ఆ యూట్యూబ్ ఛానల్ ఆ వీడియోను డిలీట్ కూడా చేసింది. కానీ వదిలిపెట్టే ప్రసక్తి కనిపించడం లేదు. నేరుగా సజ్జల ఫండింగ్ చేసిన ఆ ఛానల్ సంగతి తేల్చాలన్న అభిప్రాయం కూటమి శ్రేణుల్లో వినిపిస్తోంది.

## అమరనాథ రెడ్డి తీవ్ర స్థాయిలో అసంతృప్తి

తిరుపతి, జూన్ 16, తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేత ఎన్. అమరనాథ రెడ్డి ఎక్కడున్నారు. ఆయన టీడీపీలోనే ఉన్నారా? అసలు ఏం జరుగుతుంది? పార్టీలో ఒక్కసారిగా సైలెంట్ అయిన అమరనాథ రెడ్డి తీవ్ర స్థాయిలో అసంతృప్తికి లోనవుతున్నారా? అన్న అనుమానం కలుగుతుంది. దాదాపు రెండేళ్ల నుంచి అమరనాథ రెడ్డి పార్టీ లో యాక్టివ్ గా లేరు. గతంలో రాజకీయంగా కీలకంగా వ్యవహరించే అమరనాథ రెడ్డి ఈ టర్మ్ లో మాత్రం మౌనం పాటించడం వెనక కేవలం అసంతృప్తి కారణమని పార్టీ నేతలే చెబుతున్నారు. తనకు 2024 ఎన్నికల తర్వాత ప్రాధాన్యత దక్కడం లేదన్న అభిప్రాయంలో అమరనాథ రెడ్డి ఉన్నారు. అందుకే అమరావతికి కూడా దూరంగా ఉంటూ తన పని తాను చేసుకుంటున్నారు.చిత్తూరు జిల్లాలోని పలమనేరు నియోజకవర్గం నుంచి అమరనాథ రెడ్డి టీడీపీ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లా చిత్తూరులో ఉన్న ఈ నేత అందరినీ కలుపుకుని పార్టీని బలోపేతం చేయాల్సిన సమయం. అయితే తనకు తొలి విడత మంత్రి పదవి దక్కుతుందని భావించినప్పటికీ ఆయనకు రాలేదు. చిత్తూరు జిల్లా నుంచి కేవలం ముఖ్యమంత్రి గా చంద్రబాబు మాత్రమే ఉన్నారు. మరెవరికీ అవకాశం కల్పించలేదు. చంద్రబాబు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు మినహా మరే సందర్భంలో వీరు పెద్దగా కనిపించడం లేదు. అలాగే విపక్షాలు చేసే విమర్శలకు సయితం స్పందించడం లేదు.1996లో పుంగనూరు నియోజకవర్గంకి జరిగిన ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచి తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీకి ఎన్నికయ్యాడు. 1999లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలై, 2004లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచాడు. చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా కూడా పని చేశారు.2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పలమనేరు నియోజకవర్గం నుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 2012లో టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు.తర్వాత జూన్ 2016లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని విడి టీడీపీలో చేరాడు. 2017లో జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ విస్తరణలో భాగంగా అమరనాథ్ రెడ్డికి మంత్రి పదవి లభించింది. 2024లో ఎన్నికల్లో తిరిగి టీడీపీ నుంచి విజయం సాధించారు. ట్రాక్ రికార్డును చూసిన తర్వాత మంత్రి పదవి దక్కాల్సి ఉన్నా రాకపోవడంతో ఆయన తన పెదవి విప్పడం లేదని అంటున్నారు.

## కృష్ణ నది తీరాన " యోగాంధ్ర " కార్యక్రమం నిర్వహించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా

విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ఆధ్వర్యంలో కృష్ణా నదీ తీరాన నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. శరీరాన్ని ఎంత ఆరోగ్యంగా ఉంచుకుంటే, మనం చేసే పనిలో అంతటి అంకితభావం ఉంటుంది. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్" కోసం అందరూ సహకరించాలి.వికసిత్ భారత్, విజన్ ఆంధ్రప్రదేశ్ 2047 వంటి లక్ష్యాలను సాధించాలంటే పౌరులందరూ ఆరోగ్యంగా ఉండటం అవసరం. ఈ యోగాసనాలు సరళంగా ఉండి ప్రతి ఒక్కరూ సులభంగా ప్రాక్టీస్ చేసేలా ఉంటాయి. రోజుకు 45 నిమిషాలు సమయం కేటాయిస్తే సరిపోతుంది. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విజయవాడ వి.యం.సి స్టేడియం, అంబేద్కర్ కళా వేదికలో రాష్ట్ర స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. ప్రజలందరూ ఈ యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొని ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు

# పీక్స్ కు చేరిన బ్రదర్స్ వార్

విజయవాడ, జూన్ 16, బెజవాడ పొలిటికల్ స్క్రీన్ మీద సరికొత్త 'బ్రదర్స్ వార్' పీక్స్ కి చేరింది. నిన్నటివరకు పార్టీల మార్పు, టికెట్ల రాజకీయం చుట్టూ తిరిగిన కేశినేని సోదరుల వివాదం.. ఇప్పుడు ఊహించని మలుపు తిరిగింది. ఒకరి జాతకాలను ఒకరు రోడ్డుపైకి లాగుతూ, ఏకంగా వందల కోట్ల బ్యాంక్ స్కామ్స్, ఈడీ ఫిర్యాదుల వరకు వెళ్లడంతో ఏపీ పొలిటిక్స్ ఒక్కసారిగా వేడెక్కాయి. 2024 ఎన్నికల ముగిసినా వీరి మధ్య మంటలు చల్లారకపోగా.. మరింత ముదరడం గమనార్హం. ఈ పొలిటికల్ ఫైట్‌లో విజయవాడ సిట్టింగ్ ఎంపీ కేశినేని చిన్ని వేసిన సరికొత్త స్కెచ్ ఇప్పుడు సంచలనంగా మారింది. తనపై వస్తున్న బినామీ, భూ ఆక్రమణల ఆరోపణలకు చెక్ పెడుతూ..



ఆయన నేరుగా మాజీ ఎంపీ కేశినేని నాని ఆర్థిక మూలాలనే టార్గెట్ చేశారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకును నాని అడ్డంగా ముంచేశారని, దాదాపు రూ.120 కోట్ల ప్రజాధనాన్ని మొండి బకాయిలుగా మార్చేశారంటూ సంచలన ఆరోపణలు చేశారు. నిబంధనల్లోని లూప్‌హోల్స్‌ను వాడుకుంటూ నాని విజయవాడ 'విజయ్ మాల్యా'లా మారారని, చివరకు ఆయన ఉంటున్న ఇల్లు, వాడుతున్న హోటల్ కూడా బ్యాంక్ ఆధీనంలోనే ఉన్నాయంటూ చిన్ని బాంబ్ పేల్చారు. అయితే, తమ్ముడు వేసిన ఈ రివర్స్ అటాక్‌పై మాజీ ఎంపీ కేశినేని నాని కూడా ఏమాత్రం తగ్గడం లేదు. సోషల్ మీడియా వేదికగా ఆయన రీ-కౌంటర్ ఇచ్చారు. వేల కోట్ల ప్రభుత్వ భూములను ఒక కార్పొరేట్ సంస్థకు కట్టబెట్టే పెద్ద డీల్‌ను తాను సీఎంకు లేఖ రాసి అడ్డుకున్నానని, ఆ ఫ్రస్టేషన్‌తోనే తనపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. న్యాయ వ్యవస్థలో చిన్న లూప్ హోల్ అడ్డంపెట్టుకుని న్యాయస్థానాలనుసైతం కేశినేని నాని తప్పుదోవ పట్టించారని, తనపై పోటీ చేసిన అభ్యర్థుల్ని ఫ్రాడ్ అనటం కేశినేని నానికి అలవాటని కేశినేని చిన్ని తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ప్రజారాజ్యం పార్టీ నుంచి బయటకొస్తూ చిరంజీవి, పవన్ కళ్యాణ్‌లనూ విమర్శించాడు. ఒక్క సాక్షి మీడియా, జగన్‌ను తప్ప ఇతరులదరినీ విరమర్శించే నాని ఆంతర్యం ఏంటి? అంటూ చిన్ని ప్రశ్నించారు.జగన్ పంథాలోనే దొంగే దొంగా దొంగా అని అరిచినట్లు చేయటం నానికి అలవాటు. సామాజిక మాధ్యమం వేదికగా నాని నాపై చేసేది అసత్య ఆరోపణలే. దీనిపై పోలీసులు తమ పని తాను చేసుకెళ్తున్నారు. విజయవాడ ప్రజలకు, అలాగే చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్‌లకు మాత్రమే తాను జవాబుదారినని, సోషల్ మీడియా పోస్టులకు కాదని పేర్కొన్నారు. తనపై చేసే ఆరోపణలకు సరైన ఆధారాలు ఉంటే వాటికి సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని కేశినేని చిన్నీ స్పష్టం చేశారు.బెజవాడ పాలిటిక్స్‌లో ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

# దాడి వీరభద్రరావు దారెటు..

విశాఖపట్టణం, జూన్ 16,ఉమ్మడి విశాఖ జిల్లాలో తెలుగుదేశం పార్టీలో సీనియర్ మోస్ట్ లీడర్ గా దాడి వీరభద్రరావు ఉన్నారు. ఆయన 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అలా వరసగా నాలుగు సార్లు గెలిచి అనేక మంత్రిత్వ శాఖలను నిర్వహించిన దాడి 2007 నుంచి 2013 దాకా శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడిగా కూడా వ్యవహరించారు. అయితే ఆయన వైసీపీలోకి వెళ్ళడంతో ఆయన రాజకీయ జీవితం మీదనే కాకుండా కుమారుడి రాజకీయ భవిష్యత్తు మీద కూడా తీవ్ర ప్రభావం చూపిస్తోంది.తెలుగుదేశం పార్టీలో అయ్యన్నపాత్రుడితో సరిసమానంగా దాడి వీరభద్రరావు 1980, 1990 దశకంలో రాణించారు. ఇద్దరికీ మంత్రి పదవులు ఇచ్చి ఎన్టీఆర్ గౌరవించారు. అలాగే కీలక శాఖలను కూడా ఈ ఇద్దరు నేతలూ చూశారు. పూర్వాశ్రమంలో హిందీ మాస్టార్ గా పనిచేసిన దాడి అంటే ఎన్టీఆర్ కి ప్రత్యేకమైన అభిమానం ఉంది. అందుకే ఆయనకు కీలక స్థానం పార్టీలో కల్పించారు. ఇదిలా ఉంటే పార్టీ పదవులలో కూడా దాడికి ప్రముఖ స్థానం ఉంటూ వచ్చింది. అయితే ఆయన 2013లో తన ఎమ్మెల్సీ పదవిని రెన్యువల్ చేయలేదన్న కారణంతో టీడీపీని వీడారు. రాజకీయంగా అదే పెద్ద పొరపాటు అని ఆయన వర్గీయులు చెబుతున్నారు.అనకాపల్లిలో దాడి వీరభద్రరావు తన హవాను దశాబ్దాల పాటు చాటుకుంటూ వచ్చారు. ఎపుడైతే ఆయన టీడీపీని వీడారో నాటి నుంచే ఆయన ప్రాభవం తగ్గుతూ వచ్చింది. వైసీపీలో కూడా సరైన అవకాశాలు దక్కలేదు. దాంతో 2024 ఎన్నికల ముందు తిరిగి టీడీపీలో దాడి వీరభద్రరావు చేరారు. అయితే ఆయన కుమారుడు దాడి రత్నాకర్ కి అనకాపల్లి టికెట్ ఆశించినా దక్కలేదు. అయితే 2029 ఎన్నికల మీదనే దాడి కుటుంబం ఆశలు పెట్టుకుంది అని అంటున్నారు. అయ్యన్నపాత్రుడు కుమారుడు విజయ్ కి రాజ్యసభ సభ్యత్వం ఇచ్చి వారసులకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా టీడీపీ సంకేతాలు పంపించింది. దాంతో దాడి లాంటి సీనియర్లలో కొత్త ఆశలు మొలకెత్తుతున్నాయని అంటున్నారు. తన వారసుడిని కూడా ఎమ్మెల్యేగా చూడాలని దాడి మాస్టారు ఆశ పడుతున్నారు. అనకాపల్లిలో టీడీపీ బలంగా ఉంది.

ఇక దాడికి ప్రత్యేక వర్గం ఉంది. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల మీద ఫోకస్ పెట్టి దాడి కుటుంబం పనిచేస్తోంది. అయితే అనకాపల్లిలో టీడీపీకి ఎంతో మంది నాయకులు ఉన్నారు. టికెట్ కోసం భారీ పోటీ ఉంది. దాడి పార్టీని వీడాక చాలా మంది నాయకులు తయారయ్యారు. ఈ నేపథ్యంలో వారిని అందరినీ దాటుకుని అధినాయకత్వం మన్ననలు అందుకోవడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదని అంటున్నారు. ఇక పార్టీలో అవకాశాలు దక్కాలీ అంటే విధేయత కొలమానంగా చూస్తున్నారు.అలాగే పార్టీ కోసం కష్టించి పనిచేసే వారికే పట్టం కడుతున్నారు. మరి దాడి కుటుంబానికి న్యాయం జరుగుతుందా అన్నదే ఆయన అనుచరుల ఆలోచనగా ఉంది. మాస్టార్ రాజకీయ వారసత్వం కొనసాగాలని ఆయన అభిమానులు కోరుకుంటున్నప్పటికీ అనకాపల్లి టీడీపీ రాజకీయం మాత్రం అంత సానుకూలంగా లేదని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## రామ్మోహననాయుడికి ఆఅవకాశం లేదా...

శ్రీకాకుళం జూన్ 16, (న్యూస్ పల్స్)భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రారంభానికి కూత వేటు దూరంలో నిలిచింది. వచ్చే నెలలో ప్రారంభోత్సవం ఉంటుందన్న టాక్ నడుస్తోంది. మరోవైపు ప్రైవేటు విమానయాన సంస్థలు తమ కార్యకలాపాలను జూలై 5 నుంచి ప్రారంభించనున్నాయి. వాటికి సంబంధించి ప్రత్యేక ప్రకటన కూడా చేశాయి. ప్రస్తుతం చూస్తుంటే మాత్రం జూలైలో విమానాశ్రయం ప్రారంభం గ్యారెంటీ అని తేలిపోయింది.భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనులు శరవేగంగా జరగడంలో.. ఉత్తరాంధ్రకు చెందిన పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కృషి ఉంది. గత రెండేళ్లుగా ఆయన నిరంతరం పర్యవేక్షిస్తూ పనులను పరుగెత్తించారు. అందుకే పనులు చాలా వేగంగా కొనసాగాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడంతోనే చాలా వేగంగా పనులు జరిగాయి. ఇక్కడ విమాన రాకపోకలకు సంబంధించి ట్రయల్ రన్ సక్సెస్ అయ్యింది. చివరిగా పెండింగ్ పనులు జరుగుతున్నాయి. వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోంది.అయితే ఈ విమానాశ్రయ ప్రారంభోత్సవ సమయానికి కింజరాపు రామ్మోహన్ నాయుడు పరిస్థితి ఏంటనే చర్చ నడుస్తోంది. ఆయన ప్రస్తుతం పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఉన్నారు. 2024 ఎన్నికల్లో మోడీ నేతృత్వంలో ఎన్డీఏ మూడోసారి అధికారంలోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామి కావడంతో ఆ పార్టీకి రెండు మంత్రి పదవులు దక్కాయి కేంద్రంలో. రామ్మోహన్ నాయుడుకు కీలకమైన పౌర విమానయాన శాఖ దక్కింది. అయితే ఆయన బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఏదో ఒక వివాదం రేగుతూనే ఉంది. ఆయన శాఖ మార్పు ఉంటుందన్న ప్రచారం ఎప్పటినుంచో ఉంది.కేంద్ర మంత్రివర్గ విస్తరణ చేపట్టేందుకు నరేంద్ర మోడీ కసరత్తు ప్రారంభించినట్లు ప్రచారం నడుస్తోంది. ఈ నెల 20న ముహూర్తంగా నిర్ణయించినట్లు సమాచారం. ఈనెల 18 తో రాజ్యసభ ఎన్నికల ప్రక్రియ కూడా పూర్తవుతుంది. అందుకే మంత్రి వర్గ విస్తరణలో కొత్తవారికి చోటుతోపాటు పాత వారి శాఖల కేటాయింపు ఉంటుందన్న టాక్ ఉంది. పౌర విమానయాన శాఖ నుంచి తప్పించి.. రామ్మోహన్ నాయుడుకు పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖను ఇస్తారని ఎప్పటినుంచో ప్రచారంలో ఉంది. అదే జరిగితే పౌర విమానయాన శాఖ మంత్రిగా భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవంలో.. ప్రధాని తరువాత అదే స్థాయిలో గౌరవం దక్కాల్సిన రామ్మోహన్ నాయుడుకు ఆ ఛాన్స్ లేనట్టే. చూడాలి మరి ఏం జరుగుతుందో..

## విజయవాడలో స్వచ్ఛ భరత్ లో పాల్గొన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

విజయవాడ,ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితేనే దేశం కూడా అభివృద్ధి చెందుతుందనే ఆలోచనతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. విజయవాడలో నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడుతూ దేశ ఆర్థిక ప్రగతి, అమరావతి రాజధాని అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గతంలో చంద్రబాబు నాయుడు హయాంలో హైదరాబాద్ నగరం ఏ విధంగానైతే అభివృద్ధి చెందిందో, అదే విధంగా రాబోయే రోజుల్లో మోదీ, బాబు నాయకత్వంలో అమరావతి కూడా ఒక ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

## మైనారిటీల అభ్యున్నతికి బీజేపీ కట్టుబడి ఉంది

### మైనార్టీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా, షేక్ బాజీ


విజయవాడభారతీయ జనతా పార్టీ మైనారిటీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. మతంతో సంబంధం లేకుండా హిందూ, ముస్లిం, క్రైస్తవ, జైన్ తదితర అన్ని వర్గాల ప్రజలను సమానంగా చూసే పార్టీ బీజేపీ మాత్రమేనని అన్నారు. "సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్" అనే సిద్ధాంతంతో పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు.ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, విశ్వసనీయతను పెంపొందించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఎస్.ఐ.ఆర్. ద్వారా దేశంలో ముస్లింల ఓట్లు తొలగిస్తున్నారని ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారంలో నిజం లేదని భాషా పేర్కొన్నారు. దేశంలో కొన్ని ప్రాంతాల్లో ఒకే వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు వేయగలిగే పరిస్థితులు ఉన్నాయని, ఈ సమస్యను నివారించేందుకు "ఒక వ్యక్తికి ఒక ఓటు" అనే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని సూచించారు.

# సూపర్ టేస్టీ 'వెజ్ మంచూరియా'.. ఇలా చేస్తే టేస్ట్? అద్దిరిపోతుంది!



వెజ్ మంచూరియా అనగానే అందరికీ నోరూరుతుంది. చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకూ అందరూ వెజ్ మంచూరియాను ఇష్టంగా తింటారు. అయితే చాలా మంది వెజ్ మంచూరియాను ఇంట్లో చేసుకోవడానికి పెద్దగా ఆసక్తి చూపించరు. కానీ.. ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లో మాత్రం తింటుంటారు. ఇక ఇంట్లోనే టేస్టీగా వెజ్ మంచూరియాను ఎలా తయారు చేసుకోవాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? పూర్తి వివరాలు ఇక్కడ చూద్దాం.. వెజ్ మంచూరియా తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. క్యాబేజీ తురుము ఒక కప్పు, క్యారెట్ తురుము అర కప్పు, ఉల్లికాడలు రెండు టేబుల్ స్పూన్ లు, పచ్చిమిర్చి పొడవుగా కట్ చేసినవి రెండు, అల్లం వెల్లుల్లి పేస్ట్ ఒక టేబుల్ స్పూన్, సన్నగా తరిగిన అల్లం, వెల్లుల్లి రెండు టేబుల్ స్పూన్, మైదా పిండి రెండు టేబుల్ స్పూన్, కార్న్ ఫ్లోర్ రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు రుచికి సరిపడా, మిరియాల పొడి అర టేబుల్ స్పూన్, నూనె డీప్ ఫ్రై చేయడానికి సరిపడా తీసుకోవాలి. ఇప్పుడు వెజ్ మంచూరియా తయారీ విధానం చూస్తే ముందుగా ఒక గిన్నెలో క్యాబేజీ, క్యారెట్, మైదా, ఉప్పు, మిరియాల పొడి వేసి బాగా కలుపుకోవాలి. ఆ మిశ్రమాన్ని చిన్న చిన్న బాల్స్ మాదిరి చేసుకోవాలి. ఇప్పుడు వాటిని నూనెలో వేసి గోల్డెన్ బ్రౌన్ కలర్ లోకి వచ్చేంత వరకూ వేయించుకోవాలి. ఇప్పుడు మరో ప్యాన్ తీసుకోవాలి. అందులో కొద్దిగా నూనే వేసి వేడి చేయాలి. ఆ తర్వాత సన్నగా తరిగిన అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చి, ఉల్లిపాయలు వేసి వేయించుకోవాలి. ఆ తర్వాత సోయా సాస్, టమాటో కెచప్, కార్న్ ఫ్లోర్ ను నీళ్లలో వేసి గ్రేవీ చిక్కబడేంత వరకూ ఉడికించుకోవాలి. ఇప్పుడు వేయించిన మంచూరియా బాల్స్ ను గ్రేవీలో వేసి బాగా కలపాలి. ఉల్లికాడలతో గార్నిష్ చేసి వేడిగా సర్వింగ్ చేసుకోవడమే.. అంతే సూపర్ టేస్టీ వెజ్ మంచూరియా రెడీ అయినట్టే..

# ఇయర్‌ఫోన్స్ – ఇయర్‌బడ్స్ రెగ్యులర్ గా వాడుతున్నారా..!?



చాలామంది హెడ్‌ఫోన్స్ లేదా ఇయర్‌బడ్స్‌ను వాడేస్తున్నారు. ప్రస్తుత కాలంలో ఇయర్ ఫోన్స్ ను ఉపయోగించే వారి సంఖ్య ఎక్కువగా ఉంది. వయసుతో సంబంధం లేకుండా అందరూ ఇయర్ ఫోన్స్ ను ఉపయోగిస్తున్నారు. ప్రయాణాల్లో.. ఖాళీ సమయాల్లో ఇయర్ ఫోన్స్ ను ఉపయోగిస్తూ ఉంటారు. హెడ్‌ఫోన్స్ అయినా, ఇయర్‌బడ్స్ అయినా.. సక్రమంగా వాడితేనే వాటివల్ల ఎదురయ్యే దుష్ప్రభవాల నుంచి బయటపడవచ్చు. వీటి ఉపయోగంలో ఏమాత్రం ఉదాసీనంగా వ్యవహరించి నా.. అవి వినికిడి శక్తిపై ప్రభావం చూపుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వినికిడి వరకే కాదు.. నరాల వ్యవస్థ పైనా ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. ఇయర్‌బడ్స్ నేరుగా చెవుల్లో అమరిపోతాయి. దీంతో శబ్ద తరంగాలు.. చెవిపొరకు చాలా దగ్గరై ప్రభావం చూపుతాయి. ఎక్కువ సమయం, అధిక శబ్దంతో వినడం వల్ల వినికిడి శక్తి తగ్గడం, చెవుల్లో చికాకుగా అనిపించడం(టిన్నిటస్), అసౌకర్యం, ఇన్ఫెక్షన్లు వంటివి సమస్యలు తలెత్తే అవకాశముంది. అలాగే బయటి శబ్దాలు వినిపించకుండా ఉండాలనే ఉద్దేశంతో చాలామంది తెలియకుండానే వాల్యూమ్‌ను పెంచేస్తుంటారు. ఇది చెవులపై మరింత ఒత్తిడిని కలిగిస్తుంది. కాబట్టి నియంత్రిత వాల్యూమ్‌ను దాటకుండా చూసుకోవాలని నిపుణులు అంటున్నారు. కాగా, ఓవర్-ఇయర్ హెడ్‌ఫోన్స్.. చెవులకు బయటి భాగంలో ఉంటాయి. ఇవి చెవిపొరకు కొంత దూరంలో ఉండటంతో శబ్ద ప్రభావం తక్కువగా ఉంటుంది. అంతేకాకుండా మెరుగైన నాయిస్ క్యాన్సిలేషన్ సదుపాయం ఉండటంతో చుట్టూ ఎక్కువ శబ్దం ఉన్నా వాల్యూమ్‌ను అధికంగా పెట్టాల్సిన అవసరం అంతగా ఉండదు. హెడ్‌ఫోన్స్ బ్రేకింగ్ న్యూస్ అలర్ట్స్ ఆన్‌లైన్ వార్తా పోర్టల్ ట్రావెల్ గైడ్స్ నిపుణుల సూచనలు కాబట్టి ఇయర్‌బడ్స్‌తో పోలిస్తే హెడ్‌ఫోన్స్ కొంత వరకు సేఫ్ అని నిపుణులు సూచిస్తున్నారు. ఏ పరికరమైనా అధిక శబ్దంతో, ఎక్కువసేపు వినియోగిస్తే వినికిడి దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. చెవి లోపలి భాగంలోని సూక్ష్మ కేశ కణాలు దెబ్బతింటే అవి మళ్లీ ఏర్పడవు. అందుకే శబ్ద స్థాయిని నియంత్రించడం అత్యంత అవసరం. వినికిడి సమస్యలు ఒక్కసారిగా కాకుండా క్రమంగా ప్రభావం చూపుతాయి. మాట్లాడే సమయంలో ఇబ్బందులు, చెవుల్లో చికాకు లేదా అసౌకర్యంగా అనిపించడం వంటి లక్షణాలు కనిపించే వరకు చాలామందికి ఈ సమస్య ఉన్న విషయం తెలియదు. అయితే.. ఇయర్ ఫోన్స్ ను ఎక్కువ సమయం వాడడం వల్ల చెవిలో నిరంతరం లాగుతున్నట్టు, మోగుతున్నట్టు లేదా ఏదో తెలియని శబ్దం వినబడినట్టు ఉంటుంది. కొన్ని పరిశోధనల ప్రకారం రోజుకు 2 గంటలకు పైగా ఇయర్ ఫోన్స్ వాడే వారిలో జ్ఞాపకశక్తి తగ్గడం వంటి సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. కనుక ఇయర్ ఫోన్స్ ను ఎక్కువగా వాడే వారు జాగ్రత్తగా ఉండడం చాలా అవసరం.

# "గుత్తి వంకాయ పలావ్" ఇంట్లోనే ఈజీగా ఎలా చేయాలంటే..?

కూరగాయల రాజు వంకాయకు ఉండే ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. తెలుగు వారి వంటింట్లో వంకాయకు ఉన్న స్థానం ప్రత్యేకమైనది. "వంకాయ వంటి కూర.. వావి వరుసల వంటి చుట్టం లేదు" అనే సామెతే దీనికి నిదర్శనం. రోజువారీ భోజనంలోనూ, పండుగ వంటల్లోనూ వంకాయ లేకుండా భోజనం పూర్తైనట్లు అనిపించదు. చిన్న గుండ్రటి వంకాయల నుంచి పొడుగు వంకాయల వరకు, ముదురు ఊదా రంగు నుంచి తెల్లని వంకాయల వరకు ప్రతి రకం వేర్వేరు రుచిని, వంటలో వేర్వేరు ప్రత్యేకతను అందిస్తుంది.గుత్తి వంకాయ పలావ్ అనేది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అత్యంత రుచికరమైన సాంప్రదాయ వన్-పాట్ రైస్ డిష్. లేత గుత్తి వంకాయలు, సువాసనభరితమైన బాస్మతి బియ్యం, ఘాటు మసాలాల కలయికతో తయారయ్యే ఈ పలావ్ రుచి బిర్యానీకి ఏమాత్రం తీసిపోదు. ముఖ్యంగా వీకెండ్స్, స్పెషల్ లంచ్‌లు, అతిథులు ఇంటికి వచ్చినప్పుడు ఈ వంటకం అద్భుతమైన ఎంపికగా ఉంటుంది. చల్లటి పెరుగు రైతా లేదా మిర్చి కా సాలన్‌తో ఈ పలావ్‌ను వడ్డిస్తే రుచి మరింత రెట్టింపు అవుతుంది

కావలసిన పదార్థాలు..బాస్మతి బియ్యం – 1 కప్పు (30 నిమిషాలు నానబెట్టాలి)లేత గుత్తి వంకాయలు – 6 నుంచి 8ఉల్లిపాయ – 1 (సన్నగా తరిగినది)టమాటో – 1 (చిన్న ముక్కలుగా కట్ చేసినది)పచ్చిమిర్చి – 3 నుంచి 4 (చీల్చినవి)నూనె – 2 టేబుల్ స్పూన్లు నెయ్యి – 1 టేబుల్ స్పూన్ కొత్తిమీర – కొద్దిగా పుదీనా – కొద్దిగా ఉప్పు – రుచికి సరిపడా బిర్యానీ దినుసులు: బిర్యానీ ఆకు – 1 షాజీరా – ½ టీస్పూన్ దాల్చిన చెక్క – చిన్న ముక్క లవంగాలు – 3 యాలకులు – 2 స్టార్ అనిస్ – 1 (ఐచ్ఛికం) ధనియాలు – 1 టేబుల్ స్పూన్ జీలకర్ర – ½ టీస్పూన్ నువ్వులు – 1 టేబుల్ స్పూన్ పల్లీలు లేదా జీడిపప్పు – 2 టేబుల్ స్పూన్లు ఎండు కొబ్బరి తురుము – 2 టేబుల్ స్పూన్లు అల్లం వెల్లుల్లి పేస్ట్ – 1 టేబుల్ స్పూన్ కారం – 1 టీస్పూన్ పసుపు – చిటికెడు గరం మసాలా – ½ టీస్పూన్ ఉప్పు – తగినంత

**తయారీ విధానం..**

ముందుగా పాన్‌లో ధనియాలు, జీలకర్ర, నువ్వులు, పల్లీలు, ఎండు కొబ్బరిని విడివిడిగా దోరగా వేయించుకోవాలి. చల్లారిన తర్వాత మిక్సీలో వేసి అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, పసుపు, ఉప్పు, గరం మసాలా, కొద్దిగా నీరు వేసి మెత్తని పేస్ట్‌లా గ్రైండ్ చేసుకోవాలి.( మసాలా పేస్ట్‌లో ఒక టీస్పూన్ చింతపండు గుజ్జు కలిపితే పలావ్‌కు స్వల్ప పుల్లటి రుచి వచ్చి మరింత టేస్టీగా ఉంటుంది. )లేత గుత్తి వంకాయలను శుభ్రంగా కడిగి, తొడిమలు తీసేయకుండా అడుగు భాగం నుంచి నాలుగు గాట్లు పెట్టాలి. వంకాయలు నల్లబడకుండా ఉప్పు కలిపిన నీటిలో వేయాలి.ఇప్పుడు సిద్ధం చేసుకున్న మసాలా ముద్దను ఒక్కో వంకాయలో జాగ్రత్తగా నింపాలి. మిగిలిన మసాలా పేస్ట్‌ను పక్కన పెట్టుకోవాలి.



(చిన్న, లేత వంకాయలను ఎంచుకుంటే పలావ్ రుచి మరింత బాగుంటుంది. )అడుగు మందంగా ఉండే గిన్నె లేదా కుక్కర్‌లో నూనె, నెయ్యి వేయాలి. నూనె వేడెక్కిన తర్వాత బిర్యానీ ఆకు, షాజీరా, దాల్చిన చెక్క, లవంగాలు, యాలకులు, స్టార్ అనిస్ వేసి వేయించాలి.తర్వాత ఉల్లిపాయలు, పచ్చిమిర్చి వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ఇప్పుడు టమాటో ముక్కలు వేసి మెత్తబడే వరకు ఉడికించాలి.మిగిలిన మసాలా పేస్ట్‌ను వేసి నూనె పైకి తేలే వరకు 2 నుంచి 3 నిమిషాలు వేయించాలి.ఇప్పుడు స్టఫ్ చేసిన వంకాయలను గిన్నెలో వేసి సిమ్ మంటపై మూత పెట్టి 5 నుంచి 7 నిమిషాలు మగ్గించాలి. మధ్య మధ్యలో జాగ్రత్తగా కలపాలి.వంకాయలు సగం ఉడికిన తర్వాత వాటి నుంచి వచ్చే మసాలా సువాసన పలావ్‌కు ప్రత్యేకమైన రుచిని అందిస్తుంది.ఇప్పుడు 1 కప్పు బియ్యానికి 1½ కప్పుల నీళ్లు పోసి ఉప్పు వేసి బాగా మరగనివ్వాలి. నీరు మరిగిన తర్వాత నానబెట్టిన బాస్మతి బియ్యాన్ని నీళ్లు వడకట్టి అందులో వేయాలి.పైన కొత్తిమీర, పుదీనా చల్లి మూతపెట్టి మీడియం మంటపై అన్నం 80 శాతం ఉడికే వరకు ఉంచాలి.నీరు పూర్తిగా ఇంకిపోతున్నప్పుడు మంటను సిమ్‌లోకి మార్చి, మూతపై బరువు పెట్టి లేదా విజిల్ లేకుండా 10 నిమిషాలు దమ్ చేయాలి.

**చిట్కాలు..**

బాస్మతి బియ్యాన్ని కనీసం 30 నిమిషాలు నానబెడితే అన్నం పొడిపొడిగా వస్తుంది.

వంకాయలను ఎక్కువగా ఉడికించకండి. అవి మెత్తబడితే పలావ్‌లో కలిసిపోయే అవకాశం ఉంటుంది.

నెయ్యి తప్పనిసరిగా ఉపయోగిస్తే పలావ్‌కు బిర్యానీ తరహా సువాసన వస్తుంది.

మసాలా పేస్ట్‌లో జీడిపప్పు ఉపయోగిస్తే రిచ్ టేస్ట్ వస్తుంది.

దమ్ సమయంలో మూతను తరచూ తీసి చూడకండి.

# వాకింగ్ లో ఈ జాగ్రత్తలు తీసుకోండి చాలు






రోజుకు 10,000 అడుగులు నడవడం అనేది ఆరోగ్యానికి పరమావధిగా మారిపోయింది. ఫిట్‌నెస్ బ్యాండ్లు, స్మార్ట్‌ఫోన్లల్లో ఉండే టూల్స్ ఆధారంగా ఈ సంఖ్యను చేరుకోవడానికి ఇష్టపడుతున్నారు యువత. ప్రతి మనిషి శరీరం ఒకేలా స్పందించదు. ఒకరికి ఉత్సాహాన్నిచ్చే నడక, మరొకరి మోకాళు ్ల, నడుముకు తీవ్ర నష్టాన్ని కలిగించవచ్చు. అందుకే ఈ సంఖ్యను గుడ్డిగా నమ్మకూడదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.యూరోపియన్ జర్నల్ ఆఫ్ ప్రివెంటివ్ కార్డియాలజీ పరిశోధనల ప్రకారం, రోజుకు కేవలం 4,000 అడుగులు నడిచినా అకాల మరణాల ముప్పు చాలా వరకు తగ్గుతుంది. రోజుకు 10,000 అడుగులు నడవాలనేది ఒక అపోహ మాత్రమేనని, నడక మంచి వ్యాయామమే అయినప్పటికీ, శరీరం, కీళ్ల ఆరోగ్యంపై ఆధారపడి అడుగుల సంఖ్యను మార్చుకోవాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

**కీళ్ల నొప్పులకు దారితీసే 10,000 అడుగుల లక్ష్యం**

శారీరక శ్రమ లేకుండా ఉన్నపళంగా రోజూ 10,000 అడుగులు నడవడం ప్రారంభించే వారిలో మోకాళ్లు, చీలమండలు, నడుముపై తీవ్ర ప్రభావం పడుతుంది. ముఖ్యంగా ఊబకాయం, కీళ్లవాతం, ఫ్లాట్ ఫీట్, బలహీనమైన కండరాల సమస్యలు ఉన్నవారికి ఇది మరింత ప్రమాదకరం. ఉదయం లేవగానే మడమ నొప్పి, మోకాళ్ల వాపు, మెట్లు ఎక్కేటప్పుడు ఇబ్బంది వంటి సంకేతాలను శరీరం పంపే హెచ్చరికలుగా గుర్తించాలి తప్ప, ఫిట్‌నెస్ పురోగతిగా భావించకూడదు.అతిగా శ్రమించడం వల్ల కలిగే నష్టాల గురించి నిపుణులు మరిన్ని విషయాలు వెల్లడించారు. వ్యాయామం లేని జీవనశైలి నుండి ఒక్కసారిగా రోజూ 10,000 అడుగుల లక్ష్యానికి మారడం వల్ల మోకాళ్లు, చీలమండలు తీవ్ర ఒత్తిడికి లోనవుతాయని చెబుతున్నారు. అమెరికా సీడీసీ (అఆఅ) నివేదికలు కూడా క్రమంగా శారీరక శ్రమను పెంచడమే సురక్షితమైన మార్గమని స్పష్టం చేస్తున్నాయి.


**మహిళలకు నడకలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం**

మహిళల హార్మోన్ల మార్పులు కీళ్ల ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి. మహిళల్లో హార్మోన్ల మార్పులు కీళ్ల స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తాయి. గర్భధారణ, ప్రసవానంతరం లేదా మోనోపాజ్ సమయంలో తగిన జాగ్రత్తలు లేకుండా అతిగా నడవడం వల్ల పెల్విక్ నొప్పి మరియు కీళ్ల నొప్పులు వస్తాయని డాక్టర్లు పేర్కొంటున్నారు. అందుకే మహిళలు తమ శరీర స్థితికి తగినట్లుగా నడక అలవాటు చేసుకోవాలి.సురక్షితమైన నడక కోసం రోజుకు 3,000 నుండి 4,000 అడుగులతో ప్రారంభించి క్రమంగా దాన్ని 10,000 అడుగుల వరకు పెంచుకోవచ్చు. నాణ్యమైన స్పోర్ట్స్ షూస్ ధరించడం వల్ల కీళ్లపై ఒత్తిడి పడకుండా చూసుకోవచ్చు. కాంక్రీట్ రోడ్ల కంటే సాఫ్ట్ ట్రాక్‌లు లేదా పార్కులలో నడవడం ప్రయోజనకరం. రోజంతా ఒకేసారి నడవడానికి బదులుగా, చిన్న విరామాలతో కూడిన నడక శ్రేయస్కరం. నడకతో పాటు కండరాల బలోపేతానికి తగిన వ్యాయామాలు (స్ట్రెంత్ ట్రైనింగ్) చేయడం మోకాళ్లకు రక్షణగా నిలుస్తుంది.నడక అనేది మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి ఉపయోగపడాలి కానీ, స్మార్ట్‌వాచ్ లేదా ఫిట్‌నెస్ యాప్‌లు ఇచ్చే శిక్షగా మారకూడదు. ప్రతి ఒక్కరూ తమ దేహ దారుఢ్యాన్ని బట్టి అడుగుల సంఖ్యను నిర్ణయించుకోవడం అవసరం. కీళ్ల ఆరోగ్యం అనేది సురక్షితమైన, స్థిరమైన, క్రమబద్ధమైన అలవాట్లతోనే సాధ్యమవుతుంది.అలాగని.. 10,000 స్టెప్పుల మీద వాక్ చేయడం వల్ల లాభం లేకపోలేదు. శరీరం రోజంతా తాజాగా, ఉల్లాసంగా ఉంటుంది. మెదడు చురుగ్గా పని చేస్తుంది. ఊబకాయం గానీ, బొజ్జ గానీ వచ్చే ప్రమాదం చాలా వరకు తగ్గుతుంది కూడా. కాలి కండరాల ఆరోగ్యం మెరుగుపడుతుంది. పిక్కలు గట్టిపడతాయి. అనాయాసంగా సుదూర ప్రాంతాల వరకు నడక సాగించవచ్చు. దీనికి తగ్గట్టుగా తమ శరీరాన్ని మార్చుకోవాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు.



# ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లలో నీళ్లు తాగుతున్నారా..!?

వాటర్ బాటిల్. ఎక్కడకు వెళ్లినా.. ఎక్కడ చూసినా నీళ్లు తాగాలంటే బాటిల్ ఉండాల్సిందే. బాటిల్ నీళ్లు తాగటం ఈ మధ్య కాలంగా బాగా అలవాటుగా మారిపోయింది. ఏ షాపులో చూసినా ప్యాకేజ్డ్ వాటర్ బాటిల్స్ అందుబాటులో ఉంటున్నాయి. వాటి అమ్మకాలు కోట్లలో సాగుతున్నాయి. కాగా, అసలు ఈ ప్యాకేజ్డ్ వాటర్ బాటిల్స్ లో నీరు



తాగితే ఏం జరుగుతుందనే సందేహాలు ఉన్నాయి. వీటితో వచ్చే అనర్థాలు ఎక్కువే అని నిపుణులు చెబుతున్నారు. ప్యాకేజ్డ్ వాటర్ బాటిల్స్ లో నీరు తాగటం పై కొద్ది రోజుల క్రితం కొలంబియా యూనివర్శిటీ, రట్‌గర్స్ యూనివర్శిటీలు సంయుక్తంగా నిర్వహించిన పరిశోధనలో నివ్వెర పోయే వాస్తవాలు బయటపడ్డాయి. ఈ నీళ్లు తాగటం ద్వారా డబ్బిచ్చి రోగాలు కొని తెచ్చుకోవడమేనని తేల్చారు. వీటిల్లో నానో ప్లాస్టిక్స్ అంటే అత్యంత సూక్ష్మమైన ప్లాస్టిక్ రేణువులు. కంటికి ఏ మాత్రం కనిపించకుండా నీటిలో కరిగిపోయే ఈ నానో ప్లాస్టిక్ రేణువుల వల్ల తీవ్ర మైన అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. రక్తంలో సులువుగా కలిసిపోతాయి. మన అవయవాలను, రోగనిరోధక శక్తిని, సంతానోత్పత్తి సామర్థ్యాన్ని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నానోప్లాస్టిక్ కణాలు మన పేగులు, ఊపిరి తిత్తుల ద్వారా నేరుగా రక్తంలో కలిసి పోతాయి. రక్తం ద్వారా గుండె, మెదడు తదితర అవయవాలకు చేరుకుంటాయి. కణాల్లోకి నేరుగా కూడా చొచ్చుకుపోతాయి. ంశ్రీబనీ ఖీవజీట 'తల్లికి వందనం' నిధుల జమ పై తాజా ఆదేశాలు, ఇలా చేయకుంటే వీరికి కట్..!! నిపుణుల సూచనలు ప్లాస్టిక్ బాటిళ్ల నుండి నీరు త్రాగినప్పుడు, అనుకోకుండా ఈ చిన్న కణాలను మనం మింగేస్తాము. అనేక అంతర్జాతీయ అధ్యయనాలు బాటిల్ వాటర్‌లో మైక్రోప్లాస్టిక్‌లను కనుగొన్నాయి. వాటి ఆరోగ్య ప్రభావాల గురించి తీవ్రమైన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్లాస్టిక్‌లలోని కొన్ని రసాయనాలు శరీరంలోకి ప్రవేశించి హార్మోన్ల అసమతుల్యత, ఊబకాయం, ఇన్సులిన్ నిరోధకత, సంతానోత్పత్తి ప్రభావాలు, కొన్ని సందర్భాల్లో క్యాన్సర్ వంటి హానిని కలిగిస్తాయి. దీంతో, సాధ్యమైనంత వరకు వీటికి దూరంగా ఉండాలి. ఇప్పుడు చాలా ప్రాంతాల్లో గాజు సీసాల్లోనూ నీరు అందుబాటులో ఉంచుతున్నారు. ప్లాస్టిక్ ను దూరం చేయటానికి వీటిని వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ బాటిళ్లల్లో నీర తాగటం ఆరోగ్య పరంగా ఏ మాత్రం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# స్పోర్ట్స్ న్యూస్

## తన పేరుతో ఉన్న ఎఫ్‌బీ పేజీపై సౌరవ్ గంగూలీ ఫిర్యాదు



కోల్‌కతా: భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, బెంగాల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ఇవాళ కోల్‌కతా పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పేరుతో ఫేస్‌బుక్ పేజీని ఆపరేట్ చేసి.. తన ప్రతిష్టను దిగజార్చుతున్నట్లు ఆయన ఆరోపించారు. సౌరవ గంగూలీ ఫ్యాన్స్ అన్న సోషల్ మీడియా పేజీలో తనకు సంబంధం లేకుండానే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్పోర్ట్స్‌వికీ అనే మరో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌పై కూడా సౌరవ్ గంగూలీ ఫిర్యాదు చేశారు. థాకుర్‌పుకుర్ పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తన ప్రతిష్టను కళంకం చేసే రీతిలో ఫేస్‌బుక్ పేజీలో నిరంతరం పోస్టులు చేస్తున్నారని, ప్రజల్లో తన పట్ల నెగటివ్ భావన వచ్చేలా ప్రవర్తిస్తున్నారని గంగూలీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను పబ్లిక్ ఫిగర్ కావడం వల్ల సమస్య మరింత పెరుగుతోందని, కానీ తప్పుడు విషయాలను వ్యాప్తి చేస్తున్నారని, అభ్యంతరకర, డ్యామేజింగ్ కంటెంట్‌ను ప్రచారం చేస్తున్నారని, తన గౌరవాన్ని భంగపరిచే రీతిలో వ్యవహరిస్తున్నారని, ఈ నేపథ్యంలో కఠినన న్యాయపరమైన చర్య తీసుకోవాలని గంగూలీ తన ఫిర్యాదులో కోరారు. సౌరవ్ గంగూలీ ఫ్యాన్స్ పేరుతో ఫేస్‌బుక్ పేజీని ఆపరేట్ చేస్తున్నవారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## భారత్‌లో ఫెన్సింగ్ ఆసియా కప్.. ఈసారి ప్రత్యేకత ఏంటంటే..!



వన్డే వరల్డ్‌కప్, టీ20 ప్రపంచకప్ వంటి మెగా టోర్నీలకు ఆతిథ్యమిచ్చిన భారత్ మరో క్రీడా సంబురానికి వేదిక కానుంది. ప్రతిష్ఠాత్మక ఫెన్సింగ్ ఆసియా కప్ హక్కులు దక్కించుకుంది. జూన్ 19 నుంచి 24 వరకు ఢిల్లీలో ఈ పోటీలు జరుగనున్నాయి. ఫెన్సింగ్ ఆసియా కప్ టోర్నీ ఢిల్లీలో జరపడం ఇదే మొదటిసారి. అంతేకాదు ఆసియా ఫెన్సింగ్ కాన్ఫెడరేషన్ 39వ సాధారణ సమావేశం కూడా జరుగనుంది. ఫెన్సింగ్స్‌లో వార్షిక ఛాంపియన్‌షిప్‌గా పేరొందిన ఆసియా కప్ మరో మూడు రోజుల్లో భారత్‌లో మొదలవ్వనుంది. ఆసియాతో పాటు మధ్య, దక్షిణ ఫసిఫిక్ ప్రాంతంలోని ఫెన్సర్లు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. ఈసారి ప్రత్యేకత ఏంటంటో.. సత్తా చాటిన వాళ్లను నేరుగా ఆసియా క్రీడలకు ఎంపిక చేయనున్నారు. అంతేకాదు ఫెన్సర్లకు ర్యాంకింగ్స్ ఇవ్వడం ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలను నెలకొల్పడమే కాకుండా.. 2028లో లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశం లభించనుందిఫెన్సింగ్ ఆసియా కప్ నిర్వహించడం భారత్‌లో క్రీడాభివృద్ధికి సంకేతమని భారత ఫెన్సింగ్ సంఘం(ఈఅం) సెక్రెటరీ జనరల్ రాజీవ్ మెహతా అన్నారు. 'దేశంలో మొదటిసారి సీనియర్ ఆసియా ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్స్ నిర్వహించడం కీలకమైన ముందడుగు. ప్రపంచస్థాయి ఫెన్సర్లను ఆహ్వానించడంతో పాటు లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ 2028 సన్నద్ధతకు శ్రీకారం చుడుతున్నాం. ఈసారి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వీడియో రెఫరల్ వ్యవస్థను ఉపయోగిస్తున్నాం. ఒలింపియన్ భవానీ దేవీతో కూడిన 24 మంది భారత ఫెన్సర్ల బృందం పోటీ పడనుంది' అని రాజీవ్ వెల్లడించారు.

## 'టైమ్స్' అత్యంత ప్రభావశీలుర జాబితాలో మంధాన..!

భారత మహిళల జట్టు ఓపెనర్ స్మృతి మంధానకు అరుదైన గౌరవం లభించింది. గత కొంత కాలంగా నిలకడగా రాణిస్తున్న ఈ లెఫ్ట్ హ్యాండర్‌కు 'టైమ్స్' మ్యాగజైన్ 100 మంది 'అత్యంత ప్రభావశీలుర జాబితా'లో చోటు దక్కింది. క్రీడా విభాగంలో ఎందరో స్టార్లు ఉన్నప్పటికీ భారత్ నుంచి మంధాన మాత్రమే ఎంపికవ్వడం విశేషం. ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ, టెన్నిస్ స్టార్ అల్కరాస్ ఈ జాబితాలో ఉన్నారు. మహిళల టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై అర్ధ శతకంతో చెలరేగిన టీమిండియా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన మరో ఘనత సాధించింది. తన సొగసైన ఆటతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న మంధాన.. ఈసారి టైమ్స్ మ్యాగజీన్ 100 మంది అత్యంత ప్రభావశీలుర జాబితాలో నిలిచింది. విధ్వంసక బ్యాటింగ్‌తో



వ్యక్తిగత మైలురాళ్లను అందుకోవడమే కాకుండా భారత జట్టు విజయాల్లో కీలకమవుతున్నందున మంధానను ఎంపిక చేశామని టైమ్స్ మ్యాగజీన్ పేర్కొంది. అంతేకాదు 'రికార్డులు మంధానకు దాసోహం అవుతున్నా'యని తమ ప్రొఫైల్‌లో పోస్ట్ పెట్టింది. అంతర్జాతీయ క్రికెట్‌లో మంధాన రికార్డుల మోత మోగించింది. దేశవాళీ వన్డే మ్యాచ్‌లో డబుల్ సెంచరీతో రికార్డు నెలకొల్పిన ఈ ఓపెనర్.. మూడు ఫార్మాట్లలో శతకం సాధించిన మొదటి భారతీయురాలిగా నిలిచింది. అంతేనా.. ఒకే ఏడాదిలో వన్డేల్లో వెయ్యికి పైగా రన్స్ కొట్టిన తొలి మహిళా క్రికెటర్ తనే. 2024 నుంచి నిలకడగా రాణిస్తున్న మంధానకు బీబీసీ ఇండియన్ స్పోర్ట్స్ ఉమెన్ అవార్డు దక్కింది. అంతర్జాతీయంగానే కాదు ఫ్రాంచైజీ క్రికెట్‌లోనూ దుమ్మురేపింది మంధాన. మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు రెండు ట్రోఫీలు కట్టబెట్టింది. మంధాన సారథ్యంలో ఆర్సీబీ 2024, 2026లో ఛాంపియన్‌గా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా క్రీడా రంగంలో 2026 సంవత్సరంలో అథ్లెట్స్, కోచ్‌లు, ఎగ్జిక్యూటివ్స్, పెట్టుపడిదారులు, మార్పును తీసుకొచ్చిన వారితో టైమ్స్ మ్యాగజీన్ ఒక జాబితా సిద్ధం చేసింది. అందులో ఫుట్‌బాల్ లెజెండ్ లియోనల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో, టెన్నిస్ స్టార్ కార్లోస్ అల్కరాస్, ఫిఫా అధ్యక్షుడు గియన్ని ఇన్‌ఫాంటినో వంటి వారున్నారు. భారత్ నుంచి ఈ హోదా అందుకున్న ఏకైక అథ్లెట్ తనే.

## మెస్సి కోసం ప్రపంచం మొత్తం ఎదురుచూస్తోంది: అర్జెంటీనా కోచ్

ఫిఫా ప్రపంచ కప్ 2026లో భాగంగా బుధవారం డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా తమ తొలి మ్యాచ్ ఆడనుంది. గ్రూప్-ఐలో ఉన్న అర్జెంటీనా జట్టు అల్జీరియాతో తలపడనుంది. ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సికి ఇది 200వ అంతర్జాతీయ మ్యాచ్ కావడం విశేషం. ఈ ఫిఫా ప్రపంచ కప్ మెస్సికి ఆఖరిదంటూ వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. దీంతో మెస్సిని మైదానంలో చూడాలని అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. కొంతకాలంగా కండరాల గాయంతో ఇబ్బందిపడుతున్న మెస్సి.. పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అర్జెంటీనా ప్రధాన కోచ్ లియోనెల్ స్కలోని.. మెస్సిపై ప్రశంసలు కురిపించాడు. ప్రపంచ మొత్తం మెస్సి కోసం ఎదురుచూస్తోందని తెలిపాడు. 'అర్జెంటీనా అభిమానులు మాత్రమే కాదు.. ప్రపంచం మొత్తం మెస్సిని మైదానంలో చూడాలని కోరుకుంటోంది. అతడు కేవలం మా జట్టుకే కాదు ప్రపంచ ఫుట్‌బాల్‌కే ప్రత్యేక ఆకర్షణ. అతడి గురించి ప్రతికూలంగా చెప్పడానికి ఏమీ లేదు. మెస్సి ఎప్పుడూ జట్టుకు అండగా నిలిచాడు. జట్టు విజయాల్లో అతడి పాత్రే అత్యంత కీలకం. మెస్సి ఫుట్‌బాల్ దేవుడు అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు' అని స్కలోని వెల్లడించాడు. ఇదిలా ఉండగా, ఖతార్ వేదికగా జరిగిన ఫిఫా ప్రపంచ కప్ 2022 టైటిల్‌ను అర్జెంటీనా సొంతం



చేసుకున్న సంగతి తెలిసిందే. మరోసారి టైటిల్‌ను నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగనుంది. మెస్సి సహచరుడు నికోలస్ ఒటమెండీ ఈ సందర్భంగా మాట్లాడాడు. 'ఖతార్‌లో సాధించిన విజయం దేశాన్ని ఒక్కటిగా నిలిపింది. ఆ జ్ఞాపకాలు మాకు మరింత బలాన్నిస్తున్నాయి. అదే పట్టుదలతో మళ్లీ బరిలోకి దిగనున్నాం. అయితే మెస్సితో కలిసి ఆడటం నాకు గర్వంగా అనిపిస్తుంటుంది. అతడు సాధారణ వ్యక్తి కాదు.. మైదానంలో మెస్సి ఓ యోధుడు' అని పేర్కొన్నాడు.

## జపాన్‌పై సూపర్ విక్టరీ.. నేషన్స్ కప్ సెమీఫైనల్లో టీమిండియా..!



ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్‌లో భారత మహిళల హాకీ జట్టు అజేయంగా దూసుకెళుతోంది. ఆక్లాండ్ వేదికగా మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జపాన్‌పై కాస్త కష్టపడి గెలిచిన టీమిండియా సెమీఫైనల్ చేరుకుంది. తద్వారా సలీమా టెటె సారథ్యంలోని భారత్ గ్రూప్ ఏ నుంచి సెమీస్ బెర్తు దక్కించుకుంది. న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో జరుగుతున్న ఎఫ్ఐహెచ్ నేషన్స్ కప్‌లో భారత జట్టు గొప్పగా ఆడుతోంది. జపాన్ రూపంలో క్వార్టర్ ఫైనల్లో కఠినమైన ప్రత్యర్థికి ఎదురైనప్పటికీ 2-1తో టీమిండియా గెలుపొందింది. కెప్టెన్ సలీమా టీటె, ఫార్వార్డ్ లల్‌ర్మెసియామి చెరొక గోల్ చేయడంతో జపాన్‌కు ఓటమి తప్పలేదు. మూడో అర్ధ భాగంలో 33వ నిమిషంలో సలీమ, 49వ నిమిషంలో లల్‌రెస్మియామి గోల్ చేయడంతో భారత్ ఆధిక్యం 2-1కు చేరింది. తద్వారా ఆరు పాయింట్లో గ్రూప్ ఏ నుంచి అగ్రస్థానంలో నిలిచిన టీమిండియా సెమీస్ బెర్తు పట్టేసింది. అంతేకాదు వచ్చే ఏడాది జరుగబోయే ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌కు టీమిండియా అర్హత సాధించింది.

## స్పెయిన్‌ను వణికించి ఒక్క మ్యాచ్‌తో ఓవర్‌నైట్ స్టార్.. 24 గంటల్లో 60 లక్షల మంది ఫ్యాన్స్



2026 ఫిఫా ప్రపంచకప్‌లో ఎవరూ ఊహించని ఒక అద్భుతం జరిగింది. ప్రపంచ ఫుట్‌బాల్‌లోనే అత్యంత బలమైన జట్లలో ఒకటైన మాజీ ఛాంపియన్ స్పెయిన్‌ను, టోర్నీలోకి అనామక జట్టుగా అడుగుపెట్టిన చిన్న దేశం కేప్ వర్డే 0-0 తో నిలువరించి అందరిని ఒక్కసారిగా షాక్‌కి గురిచేసింది. వరల్డ్ నెం 2 ర్యాంక్ ఉన్న దేశంతో మ్యాచ్ ఆడుతున్నాం అన్న భయం లేకుండా స్పానిష్ జట్టుకు చుక్కలు చూపించింది. అయితే ఈ చారిత్రాత్మక డ్రా వెనుక ఆ జట్టు 40 ఏళ్ల వెటరన్ గోల్ కీపర్ వోజిన్హా (జోసిమార్ జోస్ ఎవోరా డయాస్) చూపిన అసాధారణ పోరాటపటిమ ఉంది. మ్యాచ్ ప్రారంభానికి ముందు కేవలం 50 వేల మంది ఇన్స్టాగ్రామ్ ఫాలోవర్లు మాత్రమే ఉన్న వోజిన్హా ఖాతాకు, మ్యాచ్ ముగిసిన 24 గంటల్లోనే ఏకంగా 6 మిలియన్ల (60 లక్షల) మంది కొత్త అభిమానులు వచ్చి చేరారంటే అతడు ఏ రేంజ్‌లో జట్టును ఆదుకున్నాడో అర్థం చేసుకోవచ్చు. కేప్ వర్డే దేశ మొత్తం జనాభా సుమారు 5.3 లక్షలు మాత్రమే కాగా, ఆ దేశ జనాభా కంటే పది రెట్లకు పైగా ఫాలోవర్లను సంపాదించుకుని అతను రాత్రికి రాత్రి గ్లోబల్ సోషల్ మీడియా స్టార్‌గా అవతరించాడు. ఇక ఈ మ్యాచ్‌లో స్పెయిన్ జట్టు పూర్తి ఆధిపత్యం చలాయిస్తూ ఏకంగా 27 సార్లు కేప్ వర్డే గోల్ పోస్ట్‌పై దాడులు చేసింది. అయితే ప్రపంచ స్థాయి స్టార్ ఆటగాళ్లు కొట్టిన ప్రమాదకరమైన షాట్లను వోజిన్హా గోడలా అడ్డుకున్నాడు. ముఖ్యంగా మ్యాచ్ చివరి నిమిషాల్లో ఫెర్రాన్ టోరెస్, ఐమెరిక్ లాపోర్టేలు చేసిన గోల్ ప్రయత్నాలను అతను ఒంటిచేత్తో తిప్పికొట్టిన తీరు అభిమానులను ఫిదా చేసింది. మొత్తం 8 అద్భుతమైన సేవ్స్‌తో స్పెయిన్‌కు చుక్కలు చూపించిన వోజిన్హా, ప్రపంచకప్ అరంగేట్రం మ్యాచ్‌లో ప్రత్యర్థికి ఒక్క గోల్ కూడా ఇవ్వకుండా రికార్డు సృష్టించిన అత్యంత వృద్ధ గోల్ కీపర్‌గా చరిత్రకెక్కాడు. అతని ఈ అసమాన ప్రదర్శనకు గాను 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. మరోవైపు మ్యాచ్ ముగిసిన వెంటనే వోజిన్హా మైదానంలోనే మోకాళ్లపై కూలబడి ఎమోషనల్ అవుతూ కన్నీరు పెట్టుకున్న దృశ్యాలు అందరినీ కదిలించాయి. తన కన్నీళ్ల వెనుక ఉన్న బాధను పంచుకుంటూ, తాను చిన్నప్పుడు తాతయ్య, అమ్మమ్మల వద్ద పెరిగానని, తన జీవితంలో సర్వస్వమైన వారు ఈ చారిత్రాత్మక క్షణాన్ని చూడటానికి ఇప్పుడు బతికి లేరని ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాకుండా, అమెరికా కఠినమైన వీసా నిబంధనలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన తల్లి కూడా ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూడటానికి స్టేడియానికి రాలేకపోయిందని, తన జీవితకాల స్వప్నం నెరవేరిన వేళ వారు పక్కన లేకపోవడం బాధగా ఉన్నప్పటికీ, తన దేశానికి ఈ గౌరవం తెచ్చిపెట్టడం గర్వంగా ఉందంటూ భావోద్వేగానికి గురయ్యాడు.

## 'మమ్మల్ని అమెరికా వీడాలని ఆదేశించారు'.. ఇదెక్కడి అన్యాయం..?

ఫిఫా వరల్డ్ కప్ ఆరంభ పోరును డ్రా చేసుకున్న ఇరాన్‌కు ఊహించని పరిస్థితి ఎదురైంది. న్యూజిలాండ్‌పై అదరగొట్టిన ఉత్సాహంలో ఉన్న ఆ జట్టును తక్షణమే తమ దేశం వీడాలని అమెరికా అధికారులు ఆదేశించారు. దాంతో, 'ఇదెక్కడి అన్యాయం' అంటూ ఇరాన్ ఇరాన్ కోచ్ అమిర్ ఘలెనోయినిరసన తెలిపాడు. ప్రస్తుతం జరుగుతున్న



వరల్డ్‌కప్‌లో అణచివేతకు గురవుతున్న జట్టు తమదేనని అమిర్ వాపోయాడు. పశ్చిమాసియాలో ఇరాన్ ? అమెరికా మధ్య శాంతి ఒప్పందం కుదిరినా.. మైదానంలో మాత్రం ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఫిఫా వరల్డ్‌కప్‌లో ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకున్న అమెరికా అధికారులు వివాదానికి తెర తీశారు. న్యూజిలాండ్‌తో మ్యాచ్ డ్రా చేసుకున్న ఇరాన్ జట్టను వెంటనే తమ దేశం విడిచి వెళ్లాలని అమెరికా అధికారులు ఆదేశించారు. అయితే.. ఈ నిర్ణయంపై ఇరాన్ కోచ్ అమిర్ ఘలెనోయి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాడు. మ్యాచ్ ఉన్నప్పుడు మాత్రమే అమెరికాలో అడుగుపెట్టి.. గేమ్ అవ్వగానే తిరిగి వెళ్లాలని అధికారులు చెప్పడం అన్యాయమని ఆయన పేర్కొన్నాడు. 'ఈ రోజు మ్యాచ్ అనంతరం మమ్మల్ని అమెరికా విడిచి వెళ్లాలని ఆదేశించారు. లాస్ ఎంజెల్స్‌లో ఉండి కాస్త రిలాక్స్ అవుదామనుకుంటే మమ్మల్ని మెక్సికోలోని మా శిక్షణ కేంద్రం టిజువానాకు వెళ్లాలని చెప్పారు. మాకు టోర్నీ ఆసాంతం ఎన్నో అవరోధాలు ఎదురవుతున్నాయి. మొదట్లో వీసా, ప్రయాణ ఇబ్బందులు ఎదుర్కొన్నాం. సహాయక సిబ్బంది, ఫుట్‌బాల్ సమాఖ్య అధ్యక్షుడు మహెది తాజ్ లేకుండానే మేము లాస్ ఏంజెల్స్ వచ్చాం.

# సినిమా

## ‘శ్రీనివాస మంగాపురం’ మూవీ నుంచి ‘గుండె పేలిపోతోందే’ సాంగ్ రిలీజ్

‘మంగళవారం’ చిత్రంతో సంచలన విజయం అందుకున్న దర్శకుడు అజయ్ భూపతి ‘శ్రీనివాస మంగాపురం’ తో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంతో ఘట్టమనేని వారసుడు జయకృష్ణ ఘట్టమనేని తెలుగు సినీ పరిశ్రమకు హీరోగా పరిచయమవుతుండగా, బాలీవుడ్ యువ నటి రాషా తడానీ ‘ఉయ్ అమ్మ’ పాటతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన తర్వాత టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. సీనియర్ నటుడు మోహన్ బాబు ఈ చిత్రంలో పవర్‌ఫుల్ విలన్ పాత్రలో నటిస్తున్నారు. నిర్మాత పీ. కిరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అశ్వినీదత్ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలు చార్ట్ బస్టర్ హిట్స్ గా అలరిస్తున్నాయి. తాజాగా చిత్ర బృందం మూడో సింగిల్ ‘గుండె పేలిపోతోందే’ పాటను విడుదల చేశారు.

తొలి ప్రేమలో కలిగే మధురమైన భావోద్వేగాలను ఆవిష్కరించే ఈ పాట, ఓ యువకుడు తొలిచూపులోనే ఓ అమ్మాయిపై ప్రేమలో పడిన తర్వాత అతని మనసులో కలిగే ఉత్సాహం, ఆశ్చర్యం, ఆనందాన్ని అందంగా చూపిస్తుంది. ఆమె చుట్టూనే తిరగాలని, ఆమె ఉన్న చోటే ఉండాలని కోరుకునే ప్రేమికుడి మనసుని అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది.

సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ పాటకు క్లాసిక్, మోడరన్ మెలోడీతో మేళవిస్తూ అద్భుతంగా కంపోజ్ చేశారు. సాఫ్ట్ ఫ్లూట్ బిట్స్, అందమైన వయోలిన్ స్వరాలు, ఆర్కెస్ట్రేషన్ ఈ పాటను సంగీత ప్రియులకు ప్రత్యేక అనుభూతిగామార్చాయి. ఆస్కార్ విజేత గేయరచయిత చంద్రబోస్ రాసిన సాహిత్యం తొలి ప్రేమ అమాయకత్వాన్ని అద్భుతంగా పలికించగా, అనురాగ్ కులకర్ణి తన హార్ట్ టచ్చింగ్ వోకల్స్ తో పాటకు మరింత ప్రాణం పోశారు.

ఆలయ నేపథ్యంతో చిత్రీకరించిన ఈ పాట విజువల్‌గా కూడా ఎంతో ఆకట్టుకుంటోంది. కలర్ ఫుల్ ఫ్రేమ్స్, అందమైన లొకేషన్స్, ఆకర్షణీయమైన విజువల్స్ పాటకు మరింత అందాన్ని చేకూర్చాయి. భాను మాస్టర్ కొరియోగ్రఫీ ప్రేమలో మునిగిపోయిన యువకుడి భావోద్వేగాలను చక్కగా ప్రజెంట్ చేసింది.

హీరో జయకృష్ణ ఘట్టమనేని తన నేచురల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకోగా, రాషా తడానీ సంప్రదాయ దుస్తుల్లో ఎంతో అందంగా కనిపించింది. వీరిద్దరి మధ్య కనిపించిన ఫ్రెష్ కెమిస్ట్రీ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

మధురమైన స్వరాలు, ఆకట్టుకునే సాహిత్యం, అందమైన విజువల్స్, మనసుకు హత్తుకునే ప్రేమ భావాలతో ‘గుండె పేలిపోతోందే’ పాట ఇప్పటికే సంగీత ప్రేమికులను ఆకట్టుకుంటూ రొమాంటిక్ ప్లేలిస్టుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది.



ప్రేమకథలను కొత్తదనంతో, భావోద్వేగాలతో చెప్పడంలో తన ప్రత్యేకతను మరోసారి నిరూపించిన అజయ్ భూపతి, ఈ చిత్రాన్ని కూడా బలమైన భావోద్వేగాలు, ఆకట్టుకునే కథనంతో రూపొందిస్తున్నట్లు ఇప్పటివరకు విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ స్పష్టం చేస్తోంది.


ఈ చిత్రానికి జయకృష్ణ ఎూఅ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం, మాధవ్ కుమార్ గుల్లపాటి ఎడిటింగ్, సాహి సురేష్ ప్రొడక్షన్ డిజైన్, రియల్ సతీష్ యాక్షన్ కొరియోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

‘శ్రీనివాస మంగాపురం జూలై 9న వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది.

నటీనటులు: జయకృష్ణ ఘట్టమనేని, రాషా తడాని, మోహన్ బాబు

## కలెక్షన్లలో దూసుకెళ్తున్న పెద్ది

### ఏకంగా రూ.366 కోట్ల గ్రాస్ వసూళ్లు




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన ’పెద్ది’ బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కించిన ఈ ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ భారీ వసూళ్లతో దూసుకుపోతోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ రెస్పాన్స్ అందుకున్న ఈ చిత్రం ఇప్పుడు రామ్ చరణ్ కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన సోలో చిత్రంగా నిలిచే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సంచలన వసూళ్లు నమోదు చేసిన ’పెద్ది’ తాజాగా మరో కీలక మైలురాయిని అందుకుంది. సినిమా విడుదలై తొమ్మిది రోజులు పూర్తయిన సందర్భంగా చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా కలెక్షన్ల వివరాలను ప్రకటించింది. మేకర్స్ వెల్లడించిన సమాచారం ప్రకారం, ’పెద్ది’ ప్రపంచవ్యాప్తంగా తొలి తొమ్మిది రోజుల్లో ఏకంగా రూ.366 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఈ భారీ వసూళ్లతో రామ్ చరణ్ కెరీర్‌లో ’పెద్ది’ రెండో అతిపెద్ద గ్రాసర్‌గా నిలిచింది. ముఖ్యంగా సోలో హీరోగా చరణ్ నటించిన చిత్రాల్లో అత్యధిక వసూళ్లు రాబట్టిన సినిమాగా ఇది రికార్డు సృష్టించింది. గ్రామీణ నేపథ్యం, క్రీడా అంశాలు, భావోద్వేగాలతో కూడిన కథ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుతం వీకెండ్ బుకింగ్స్ కూడా ఆశాజనకంగా ఉన్నట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ’పెద్ది’ త్వరలోనే రూ.400 కోట్ల గ్రాస్ క్లబ్‌లోకి చేరడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వీకెండ్ ముగిసే నాటికి ఈ చిత్రం 400 కోట్ల మార్కును అందుకుంటుందా లేదా అనే అంశంపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో పెద్ద సినిమాల పోటీ లేకపోవడం, కుటుంబ ప్రేక్షకుల మద్దతు కొనసాగుతుండటం ’పెద్ది’కి అదనపు బలంగా మారింది. ఈ చిత్రంలో రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభిస్తున్నాయి. పాత్రలో ఆయన చూపించిన భావోద్వేగాలు, క్రీడాకారుడిగా చేసిన పరివర్తన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా కథను తెరకెక్కించిన తీరు కూడా ప్రత్యేక ప్రశంసలు అందుకుంటోంది.

## ఓ సుకుమారి...టీజర్ విడుదల

తిరువీర్, ఐశ్వర్య రాజేశ్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం ’ఓ..! సుకుమారి’. భరత్‌దర్శన్ దర్శకుడు. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రమిది. మహేశ్వరరెడ్డి మూలి నిర్మిస్తున్నారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శనివారం టీజర్ విడుదలైంది. ఒక్క నిజం దాచి పెట్టి కథానాయకుడిగా పెళ్లి చేస్తే ఏం జరిగిందన్న ఆసక్తికర అంశానికి వినోదాన్ని జోడించి ఈ మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. రఘూన్సీ, మురళీధర్‌గౌడ్, ఆనంద్, అంజిమామ, శివానంద్, కోట జయరామ్ తదితరులు నటిస్తున్నారు.




## నాగబంధం’ మూవీ విజువల్ గా మెస్మరైజ్ చేస్తుంది : డీవోపీ ఎస్. సౌందరరాజన్

విరాట్ కర్ణ హీరోగా అభిషేక్ నామా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎపిక్ అడ్వెంచర్ థ్రిల్లర్ ‘నాగబంధం ? ది సీక్రెట్ ట్రెజర్’. నిక్ స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతిబాబు, మహేష్ మంజ్రేకర్, రిషభ్ సాహ్నీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జూలై 3న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా డీవోపీ ఎస్. సౌందరరాజన్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.



నాగబంధం ప్రాజెక్టులోకి ఎలా వచ్చారు?

–నేను ఇంతకుముందు అభిషేక్ గారితో డెవిల్ సినిమా చేశాను. అప్పటి నుంచి ఆయనతో చాలా మంచి అనుబంధం ఉంది. అభిషేక్ గారు చాలా పెద్ద విజన్‌తో ఈ కథను మొదలుపెట్టారు. నేను స్క్రిప్ట్ స్టేజ్ నుంచే ఈ ప్రాజెక్టులో ఇన్‌వాల్వ్ అయ్యాను. నాగబంధం ఐడియా మా అందరినీ ఎంతగానో ఉత్సాహపరిచింది. మొదట కథను లాక్ చేశాం. తర్వాత దాన్ని విజువల్‌గా ఎంత గ్రాండ్‌గా, ఎంగేజింగ్‌గా చూపించాలనే దానిపై ప్లాన్ చేశాం.

ఇందులో మీకు చాలెంజింగ్‌గా అనిపించిన వర్క్ ఏంటి?

–నేను ఇంతకుముందు ఫాంటసీ సినిమాలు చేశాను. విజువల్స్‌ను గ్లామరైజ్ చేసి, ఎలివేట్ చేసేలా కూడా చేసిన అనుభవం ఉంది. కానీ ఈ సినిమా మాత్రం చాలా ప్రత్యేకం. చాలా నేచురల్ స్టైల్లో ఈ సినిమా చేయడం జరిగింది. ప్రతి సన్నివేశానికి తగ్గట్టుగా సహజమైన లైటింగ్‌తో, కథలో లీనమయ్యేలా తీశాను. ఎక్కడా ఓవర్ గ్లామర్ చేయడం గానీ, అనవసరమైన డ్రామా సృష్టించడం గానీ చేయలేదు.

చాలా భారీ బడ్జెట్, వీఎఫ్ఎక్స్‌తో వస్తున్న సినిమా కదా. డీవోపీగా మీకు ఎలాంటి ఛాలెంజ్‌గా అనిపించింది?

–విజువల్ ఎఫెక్ట్స్‌ను మనం రెండు రకాలుగా వాడుతుంటాం. ఒకటి గ్రాండియర్ కోసం, మరొకటి రియల్‌గా అనిపించేందుకు. అయితే ఆ విజువలైజేషన్ సహజంగా కనిపించడం చాలా పెద్ద టాస్క్. చాలామందిని తీసుకెళ్లి హిమాలయాల్లో షూటింగ్ చేయడం ప్రాక్టికల్‌గా సాధ్యం కాదు. అలాంటి సమయంలో విజువల్ ఎఫెక్ట్స్ ఉపయోగపడతాయి. కానీ వాటిని సహజంగా, నిజంగా కనిపించేలా చేయడం చాలా కష్టమైన పని. ఈ సినిమాలోని వీఎఫ్ఎక్స్ అన్నీ కూడా చాలా నేచురల్‌గా, రియల్‌గా ఉంటాయి.

ఈ సినిమాలో విజువల్స్ అన్నీ చాలా రియల్‌గా కనిపిస్తున్నాయి. మీరు ఎలాంటి గ్రౌండ్ వర్క్ చేశారు?

–నేను, డైరెక్టర్ గారు, ఆర్ట్ డైరెక్టర్ కలిసి చాలా దేవాలయాలు తిరిగాం. తిరువనంతపురంలోని శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయాన్ని సందర్శించాం. అక్కడ ప్రతి అంశాన్ని డీటెయిల్‌గా ఫొటోగ్రాఫ్ చేశాం. అదే ఆలయాన్ని ఆధారంగా చేసుకున్నప్పటికీ సినిమాలో “శ్రీరంగపురం” అనే పేరు పెట్టాం. శ్రీరంగం, తిరువనంతపురం ప్రాంతాల వైభవాన్ని కలిపేలా ఆ పేరు నిర్ణయించాం. ఆ దేవాలయానికి సంబంధించిన అంశాలపై చాలా రీసెర్చ్ చేశాం. అలాగే ఆర్ట్ డైరెక్టర్ అశోక్ గారు అద్భుతమైన సెట్లు వేశారు. అనంత పద్మనాభస్వామి టెంపుల్ సెట్‌లోకి అడుగుపెడితే నిజంగా ఆలయంలోకి వెళ్లిన అనుభూతి కలుగుతుంది. అంత అద్భుతంగా ప్రతి సెట్‌ను తీర్చిదిద్దారు.

–ఇంతకుముందు కూడా పెద్ద సినిమాలు చేశాను. కానీ ఇంత భారీ స్థాయిలో సెట్లు ఉన్న సినిమాను నేను ఎప్పుడూ చేయలేదు. అంత పెద్ద సెట్లను లైటింగ్ చేయడం, హై స్పీడ్‌లో షూట్ చేయడం చాలా చాలెంజింగ్ వర్క్. షూటింగ్ భారీ స్థాయిలో జరిగింది.

డైరెక్టర్ అభిషేక్ గారి గురించి?

–ఆయన అద్భుతమైన కథను రాసుకున్నారు. ఆ ఆలోచన మా అందరికీ ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. దర్శకుడిగా ఆయన అందరినీ సర్‌ప్రైజ్ చేశారు. ఆయన క్లారిటీ, విజువల్ సెన్స్, కోఆర్డినేషన్ అన్నీ అద్భుతం. ప్రతి విభాగం నుంచి బెస్ట్ ఔట్‌పుట్ రాబట్టుకున్నారు.

ఇందులో ఒక ఎపిసోడ్ చేయడానికి 10 కోట్లు అయ్యిందని విన్నాం?

అవును. మేము ఒక్కో అంశాన్ని ఇంప్రొవైజ్ చేసుకుంటూ వెళ్లాం. ఒక సెట్ డిజైన్ చేసిన తర్వాత ఇంకా గ్రాండ్‌గా ఉంటే బాగుంటుందనే ఆలోచనతో బడ్జెట్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా గొప్ప స్థాయిలో సినిమాను తెరకెక్కించాం.

షూటింగ్ ఎక్కడ చేశారు?

–హైదరాబాద్, కేరళ, తమిళనాడు, అలాగే హిమాలయాల్లోని కొన్ని ప్రాంతాల్లో కీలక సన్నివేశాలు చిత్రీకరించాం.

నిర్మాతల గురించి?

అభిషేక్ నామా గారి విజన్‌కు నిర్మాతలు ఎంతగానో సపోర్ట్ చేశారు. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా కథకు తగ్గట్టుగా చాలా గ్రాండ్ స్కేల్‌లో సినిమాను నిర్మించారు. మా నిర్మాతలకు సినిమా అంటే చాలా పాషన్. ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా ఈ సినిమాని నిర్మించారు.

హీరో విరాట్ కర్ణ గురించి?

విరాట్ కర్ణ చాలా కమిట్‌మెంట్ ఉన్న నటుడు. ఈ సినిమా కోసం ఎంతో అంకితభావంతో పనిచేశారు. డిసెంబర్, నవంబర్ నెలల్లో తీవ్రమైన చలిలో కూడా అండర్‌వాటర్ సన్నివేశాల్లో పాల్గొన్నారు. జ్వరంతో కూడా షూట్ కి వచ్చారు. చాలా ఫ్లెక్సిబుల్‌గా ఈ సినిమా చేశారు. ఆయన కమిట్‌మెంట్ స్క్రీన్‌పై స్పష్టంగా కనిపిస్తుంది.

ఈ సినిమా మేజర్ హైలట్ ఏమిటి?

–ఈ సినిమా హైలైట్ అనంత పద్మనాభస్వామి టెంపుల్, అక్కడ జరిగే సన్నివేశాలు. అవి అద్భుతంగా ఉంటాయి. అలాగే క్లైమాక్స్ కూడా ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తుంది. అది చాలా బిగ్ స్కేల్‌లో ఉంటుంది. ఈ సినిమా భారీ విగ్రహాన్ని రూపొందించాం. ఈ వర్క్ లో దేశంలోని ప్రముఖ నిపుణులు పాల్గొన్నారు.

–ఇందులోని విజువల్స్ అన్నీ చాలా అథెంటిక్‌గా ఉంటాయి. షూటింగ్ సమయంలో కూడా ప్రతి ఒక్కరూ ఎంతో భక్తి భావంతో ఉండేవారు. చెప్పులు బయటే వదిలి సెట్స్‌లోకి వచ్చేవారు. అలాగే షూటింగ్ ప్రారంభానికి ముందు ప్రత్యేకంగా నియమించిన అర్చకుడు పూజలు నిర్వహించిన తర్వాతే షూటింగ్ చేసేవాళ్లం.

–ఈ సినిమాలో మైథాలజీ, ఫిక్షన్, డ్రామా అన్నింటినీ మిళితం చేస్తూ ఒక విజువల్ ఫీస్ట్‌లా మలిచాం. అలాగే ట్రావెన్కోర్ ప్రధాన అర్చకుడిని కలిసి ఎన్నో విషయాలు తెలుసుకుని, చాలా చిన్న చిన్న డీటెయిల్స్‌ను కూడా సినిమాలో పొందుపరిచాం.

ఈ సినిమా కోసం కెమెరా వర్క్ పరంగా కొత్త ఎక్విప్‌మెంట్ ఏదైనా ఉపయోగించారా?

–చాలా పెద్ద సెట్లలో తీసిన సినిమా ఇది. ఆ మొత్తం సెట్‌ను ఒకే షాట్‌లో చూపించడం నాకు చాలెంజ్‌గా అనిపించింది. అందుకోసం చాలా ఖరీదైన డ్రోన్‌ను ఉపయోగించాం. ఆలయ ప్రవేశ ద్వారం నుంచి పద్మనాభస్వామి విగ్రహం వరకు ఒకే షాట్‌లో చిత్రీకరించాం. దాని కోసం చాలా రిహార్సల్స్, అనేక టేక్స్ తీసుకున్నాం. ఆ షాట్ అద్భుతంగా వచ్చింది.

మ్యూజిక్ గురించి?

–ఈ సినిమా మ్యూజిక్ కూడా చాలా డివైన్‌గా ఉంటుంది. మేము షూటింగ్ చేసినప్పుడే మ్యూజిక్ రిఫరెన్స్‌తో పాటు షూట్ చేసేవాళ్లం. ప్రతి ముఖ్యమైన సీక్వెన్స్‌కు మాకు ముందుగానే మ్యూజిక్ రిఫరెన్స్ ఉండేది. దాంతో కెమెరా వర్క్ కూడా మరింత ఎన్‌హాన్స్ అయింది.

‘నాగబంధం’ విజువల్‌గా ఆడియన్స్‌కు ఎలాంటి అనుభూతిని ఇస్తుంది?

–ఈ సినిమా ప్రేక్షకులను ఎంగేజ్ చేస్తూ, ఎంటర్‌టైన్ చేస్తూ, ఒక డివైన్ అనుభూతిని కూడా అందిస్తుంది. ఖచ్చితంగా ఇది ప్రేక్షకులకు అద్భుతమైన విజువల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది.

Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com